
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు


ఆదివారం 18 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.6	29.5
కావలి	36	27
ఆత్మకూరు	39	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27



మన పూర్వీకులు ఎలా ఉండేవారు.. పాత్రలు ఎలా ఉండేవి.. అప్పటి రాజులు వాడిన ఆయుధాలు ఏవి!? నాణేలు ఏవిధంగా ఉండేవి? వాటిని ఏ లోహంతో తయారు చేసేవారు. శాసనాల మాటేమిటి!? ఉత్సవ విగ్రహాలు ఎలా ఉండేవి? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. నాటి వైభోగాన్ని కనులారా వీక్షించాలని అనుకుంటున్నారా!? అయితే, నెల్లూరుకు వచ్చేయండి. నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న జిల్లా మ్యూజియాన్ని సందర్శించండి. ఆదివారం అంతర్జాతీయ మూజియం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..





నాటి వైభోగం
నేటికీ సాక్షాత్కారం

- మ్యూజియంలో పదిలంగా..
- నేడు అందరికీ ఉచిత ప్రవేశం

మ్యూజియం భవనంలోకి ప్రవేశించిన వెంటనే ఎదురుగా శిల్ప కళాతోరణం మనల్ని ఆహ్వానిస్తుంది. ఇందులో మొత్తం 24 రాతి శిల్పాలు ఉన్నాయి. క్రీస్తు శకం 11 నుంచి 14వ శతాబ్దం కాలం నాటి విఘ్నేశ్వరుడు, విష్ణువు, గౌతమబుద్ధుడు, లక్ష్మీనారాయణుడు, వీరభద్రుడు వంటి శిల్పాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఉమ్మడి జిల్లాలోని నెల్లూరు, సూళ్లూరుపేట, బుచ్చి, పెనబర్తి, ఉదయగిరి తదితరల ప్రాంతాల నుంచి సేకరించి, ఇక్కడ ప్రతిష్ఠించారు.



● **ఆది మానవుడి గురించి :** మ్యూజియం లోపలి వస్తువులను చూడాలి అంటే ఆదిమానవుడి శిలా యుగ జీవన విధానం చూడాలి. ఆదిమానవుల జీవితం తోపాటు వారి రాతి ఆయుధాలు, మట్టిపాత్రలు, నిప్పును సృష్టించడం, మట్టి శవపేటిక, అంత్యక్రియలకు ఉపయోగించిన మట్టి పాత్రలు వంటివి మనల్ని ఆలోచింపజేస్తాయి. ప్రకాశం జిల్లా గిద్దలూ రు, తాళ్లపల్లి గ్రామంలో జరిగిన తవ్వకాల్లో ఇవి బయటపడగా, ఇక్కడ భద్రపరిచారు.

● **19వ శతాబ్దపు శిల్ప కళా గ్యాలరీ :** ఆదిమ మానవుల గ్యాలరీ తర్వాత 19వ శతాబ్దపు శిల్ప కళా గ్యాలరీకి చేరుకుంటాము. ఇక్కడ సున్నంతో చేసిన శిల్పకళ, మట్టితో చేసిన శిల్ప కళా వైభవం ఆకట్టుకుంటుంది.

● **లోహపు పాత్రలు, శిల్పాలు:** తర్వాత గ్యాలరీలో 18-19వ శతాబ్దంలో మన పూర్వీకులు వాడిన లోహపు పాత్రలు, శిల్పాలు కనిపిస్తాయి. వాటిలో చిద్రి పాత్రలు ప్రత్యేకంగా కనిపిస్తాయి.

● **దారు శిల్పాలు :** మన పూర్వీకులు తొలినాళ్లలో కొయ్యపై చెక్కిన దేవతామూర్తులను పూజించారు. తర్వాతి కాలంలో రాతి శిల్పాలు, లోహపు శిల్పాలను పూజిస్తున్నాము. వీటిలో సీతా రామలక్ష్మణ విగ్రహాలతోపాటు టీపీగూడూరు మండలం కాటేపల్లిలో లభించిన శిల్పాలు ఉన్నాయి.



నెల్లూరు (సాంస్కృతికం) మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు విద్య, వినోదం, చరిత్ర సామాజిక జీవన వైవిద్యాలు తెలియజేసేందుకు.. ఒక సాంస్కృతిక, శాస్త్రీయ కళాత్మక విలువ కలిగిన వస్తువులు, కళలను, ఆధారాలను సేకరించి భద్రపరిచి, ప్రదర్శించడమే మ్యూజియం. ఒక్కసారి మ్యూజియంను సందర్శిస్తే మన చరిత్ర, విలువలు తెలుస్తాయి. ప్రతి ఒక్కరు మ్యూజియంను సందర్శించి, వాటిని విలువలను భావితరాలకు తెలియజేయాలి. నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు సమీపంలోని సరస్వతీనగర్‌లో నెల్లూరు మ్యూజియం భవనాన్ని 2006, జూన్ 4వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత కలెక్టర్ ఆనంద్ ఈ యేడాది ఆరంభంలో మ్యూజియంను సందర్శించి, మరమ్మతులను కార్పొరేషన్ ద్వారా చేయించారు.



నేడు అంతర్జాతీయ మ్యూజియం డే

● **ప్రదర్శన వేళలు.. టిక్కెట్ల వివరాలు**

ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మ్యూజియం తెరిచి ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు రోజుల్లో మ్యూజియం తలుపులు తెరుచుకోవు.

● **ప్రవేశ రుసుము**

పెద్దలకు ఒకరికి రూ.3, పిల్లలకు రూ.1. ఫొటోలు తీసుకోవాలంటే రూ.20. వీడియో తీసుకోవాలంటే రూ.100 టిక్కెటు తీసుకోవాలి. ఇక విదేశీయులు ఫొటోలు తీసుకోవాలంటే రూ.100, వీడియోకు రూ.500 చెల్లించాలి.

● **త్వరలో అధునాతన సౌకర్యాలు**

మ్యూజియంలో సాంకేతిక పరిజ్ఞానంతో సందర్శకులకు అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా పురావస్తు శాఖ సహాయ సంచాలకుడు, మ్యూజియం అధికారి గంగాధర్ తెలిపారు. మ్యూజియండే సందర్భంగా ఆదివారం సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

● **నాణేల గ్యాలరీ :** మ్యూజియంలో ఆసక్తిగా తిలకించే గ్యాలరీ నాణేలు ఉన్నవే. రాష్ట్ర రాజధాని అమరావతి గ్రామంలో లభించిన విద్దాంక నాణేలు, రోమన్ కాలం నాటి నాణేలు, క్రీస్తు శకం 1 నుంచి 3వ శకం నాటి నాణేలు, విష్ణుకుండిడి కాలం, యాదవరాజులు కాలం నాటి నాణేలు, ఢిల్లీ సుల్తాన్, విజయనగర రాజులు, కుతుబ్‌షా, అసఫ్ జాహీ కాలం నాటి నాణేలను తిలకించవచ్చు. 7వ నిజాం కాలం 1918లో రూ.100, రూ.10 నోట్లు ముద్రించడం జరిగింది. 1919లో రూ.5 నోటు చెలామణిలో వచ్చిందనే విషయాలు పొందుపరిచారు.

● **రాగి శాసనాలు :** క్రీస్తు శకం 5 నుంచి 14వ శతాబ్దం వరకు ఆనాటి రాజరిక ప్రభుత్వాలు ప్రకటించిన రాగి శాసనాలను భద్రపరిచారు. వాటి వివరాలు ఆ గ్యాలరీలో ఉన్నాయి.

● **రక్షణ కవచాలు, ఆయుధాలు :** రాజుల కాలంలో వాడిన రక్షణ కవచాలు, ఆయుధాలనూ ఓ గ్యాలరీలో భద్రపరిచారు. 19వ శతాబ్దపు ఖడ్గాలు, విల్లు, అమ్ములపొది, ఈటెలు, డాలు, ఫిరంగి - గుండ్లు, పేలుడు పదార్థాలు, తుపాకీలు కనిపిస్తాయి. వాటిని తయారీకి వాడిన వారు, వాటి వివరాలు ఉన్నాయి.

● **కంచు కళాఖండాలు :** కంచుతో తయారు చేసిన వైష్ణవ, శైవమూర్తులు విగ్రహాలు ఆకట్టుకుంటాయి. అందులోనే విగ్రహాల తయారీ వివరాలను పేర్కొన్నారు. ఇక్కడే ఇందుకూరుపేట మండలం పల్లెపాడు గ్రామంలో 1921 జూన్ 4వ తేదీన ఏర్పాటు చేసిన గాంధీ ఆశ్రమం ఫొటో కనిపిస్తుంది.





వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా అన్నదాతలకు ప్రయోజనం లేకుండా పోతోంది. గత ప్రభుత్వం ఆయా కమిటీల నాయకత్వ లోపం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో ఉన్న నిధులు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో కమిటీల ఏర్పాటు లక్ష్యం కాస్తా నీరుగారిపోతోంది. కూటమి ప్రభుత్వం రాకతో కమిటీలకు పాత వైభవం తిరిగి వస్తుందన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

ఆదాయం ఘనం..
సేవలు శూన్యం!

- వసూళ్లకే పరిమితమైన మార్కెట్ కమిటీలు
- అన్నదాతకు అందని సేవలు

జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) ఉన్నాయి. నెల్లూరు, కోవూరు, కావలి, కందుకూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లి ఏఎంసీల పరిధిలో జిల్లావ్యాప్తంగా దాదాపుగా 21 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సెస్సు వసూలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఒక్కో మార్కెట్ కమిటీకి ప్రభుత్వం రూ.కోట్లలో లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఏడాదికేడాది లక్ష్యాల్లో మార్పులు ఉంటాయి. ఏఎంసీల పరిధిలోని గోదాముల అద్దెలతోపాటు పంట ఉత్పత్తుల నిల్వలతోపాటు పంట ఉత్పత్తుల నుంచి సెస్సు రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. అయితే ఆ నిధులను రైతుల కోసం కాకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారు.

● రూ.కోట్లలో ఆదాయం

జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల ద్వారా రుసుము రూపంలో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. 2019-20లో రూ.28.40 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా 24.65కోట్ల వసూళ్లయ్యాయి. 2020-21లో రూ.31.14కోట్లకు 11.22 కోట్లు, 2021-22లో దాదాపు రూ.32 కోట్లకు 23.45 కోట్లు, 2022-23లో రూ.20.30 కోట్లకు 34.42 కోట్లు, 2023-24లో రూ.35.03కోట్లకు దాదాపుగా 32.51కోట్లు వసూళ్లయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగిస్తూ రైతులకు చేయాల్సిన మేలును పూర్తిగా విస్మరించింది. 2024-25కు సంబంధించి రూ.34.43 కోట్లు లక్ష్యం కాగా దాదాపు 31.67 కోట్లు వసూలు చేసినట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. 2025-26కు రూ.39.42 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. నెల్లూరు ఏఎంసీకి రూ.5.92 కోట్లు, కోవూరుకు రూ.11.11కోట్లు, కావలికి 7.27 కోట్లు, కందుకూరుకు రూ.3.75 కోట్లు, రాపూరుకు రూ.1.34 కోట్లు, ఆత్మకూరుకు రూ.4.5 కోట్లు, ఉదయగిరికి రూ.2.96 కోట్లు, సర్వేపల్లికి రూ.2.57 కోట్ల వంతున వసూళ్ల లక్ష్యం విధించారు.

● అన్నదాతలకు సేవలేవి!?

మార్కెట్ కమిటీల ద్వారా వస్తున్న ఆదాయంతో ఆయా మార్కెట్ యార్డుల్లో రైతులకు మౌళిక సదుపాయాలు కల్పించాలి. అదేవిధంగా రైతుబంధు పథకం ద్వారా వడ్డీలేని రుణాలు అందించాలి. పంట పొలాల నుంచి ప్రధాన రహదారి వరకు రహదారులు నిర్మించాలి. ఇంకా ఏడాదికి కనీసం నాలుగు వైద్యశిబిరాలు నిర్వహించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ సేవలను పక్కన పెట్టేసింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో కమిటీ సేవలు తిరిగి ప్రారంభమవుతాయని, వడ్డీలేని రుణాలు అందుతాయని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం

మార్కెట్ కమిటీలు లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేసి సెస్సు వసూలు చేస్తున్నాం. అదేవిధంగా ఆన్‌లైన్‌లో చెల్లింపులపైనా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో లక్ష్యాలను చేరుకోగలుగుతున్నాం. కమిటీల నియామకంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

- పి.అనితకుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ

లక్ష్మీనృసింహస్వామి
గోవిందా.. గోవింద!

- వేడుకగా శ్రీవారి జయంత్యుత్సవం
- భక్తులతో కిక్కిరిసిన మాలకొండ క్షేత్రం

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామస్మరణలతో మాలకొండ క్షేత్రం మారుమోగింది. మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి జయంత్యుత్సవాలు శనివారం మాలకొండలో వేడుకగా జరిగాయి. వారంలో శనివారం ఒక్కరోజే ఈ ఆలయం తెరవడం.. అలాగే స్వామివారం జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణంతా కిక్కిరిసిపోయింది. క్యూలైన్లు కిటకిటలాడగా, ప్రత్యేక దర్శనం కోసం ఐదు గంటలకుపైగానే సమయం పట్టింది. ఆలయ అధికారుల అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో ఎక్కడికక్కడ దాతలు సాయంతో మజ్జిగ, మినరల్‌వాటర్, శీతలపానీయాలు, అన్నదానం, నీడ వసతికి షామియానాలు, తాటాకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే వైద్యశిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానాలు చేసి, గొడుగుబండ కింద మహిళా భక్తులు పొంగళ్లు పెట్టుకొని, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని మహా అన్నదానంను ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, మాలకొండయ్య ప్రారంబించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సౌజన్య దంపతులను పలువురు నాయకులు సన్మానించారు. కాగా, గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒకరిపై మరొకరు రాజకీయ విమర్శలు చేసుకొన్న ఎమ్మెల్యే ఇంటూరి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌లు జయంత్యుత్సవాల్లో ఒకరినొకరు చేతులు కలుపుకొని, ఆప్యాయంగా పలకరించుకోవడం అంతటా చర్చనీయాంశంగా మారింది.



మాలకొండలో భక్తుల రద్దీ

● మాలకొండ ఆదాయం రూ. 18,23,562

మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 18,23,562 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ.సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 6,52,100, అన్నదానం ద్వారా రూ. 6,16,126, లడ్డూప్రసాదం ద్వారా రూ. 3,24,680, తలనీలాలు ద్వారా రూ. 1,01,125లు ప్రధానంగా లభించినట్లు పేర్కొన్నారు.



గొడుగుబండ కింద పొంగళ్లు పెట్టుకుంటున్న మహిళా భక్తులు



అన్నదానంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు నాగేశ్వరరావు, ఎంఏ కొండయ్య

కామాక్షితాయి
బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ సేవాకమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి ఆలయ ఆచార సంప్రదాయాలతో పురోహితులు, వేదపండితులు, అర్చకులు, వేదమంత్రాలు, మంగళమేళాలతో ఆలయం నుంచి పెన్నానదికి వెళ్ళి అక్కడ పూజలు నిర్వహించి, పొట్టమట్టి తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో కలశస్థాపన చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాకమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణం జరగనుంది. సంతాన లేమితో బాధపడే మహిళలు ఈ కార్యక్రమంలో అర్చకులు ధ్వజానికి నివేదించిన కొడిముద్దలను పంపిణీ చేస్తారు.



పెన్నానదిలో పూజలు చేస్తున్న అర్చకులు

'సీ' కేటగిరీ ఆలయాలకు పాలకమండళ్లు

- నోటిఫికేషన్ జారీ
- ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు (సాంస్కృతికం), మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీ కేటగిరీ కలిసిన ఆలయాల దేవస్థానాలకు ధర్మకర్తల నియమాకానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. సీ కేటగిరీలో రూ.5లక్షలుపైన రూ.25 లక్షల లోపు ఆదాయం కలిగిన ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని 45 దేవాలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు కొత్త రిజర్వేషన్ ప్రకారం 9 మంది కమిటీ మెంబర్లు నియమాకం జరుగుతుంది. 9 మందిలో 50 శాతం మహిళలు ఉండాలి. గతంలో ఈ ఆలయాలకు ఏడుగురు ధర్మకర్తలు ఉన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్తపాలసీలో ఒక నాయీబ్రాహ్మణుడికి స్థానం కల్పించనున్నారు. ఐదుగురిని రిజర్వేషన్ ప్రకారం నియమిస్తారు. ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చినట్లు సమాచారం. ఆయా దేవాలయాల నోటీసు బోర్డులలో నోటిఫికేషన్ నకళ్లను తగిలించి చేతులు దులుపుకున్నారు.



కందుకూరు, ముత్తుకూరు, కోవూరులలో శనివారం తిరంగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఎన్డీఏ కూటమి నేతలతోపాటు అధికారులు త్రివర్ణ పతాకాలు చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం అడ్డదారులు
● కార్పొరేట్ విద్యాసంస్థలో వింత పోకడ

ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి
నగదు రికవరీకి సిఫారసు

'అమృత్'పై చర్చా వేదికకు రా!
మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కు కావలి ఎమ్మెల్యే సవాల్
- వివరాలు 8లో..

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రపై అవగాహన

మనుబోలు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం అధికారులు నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. చంద్రమౌళీనగర్ గిరిజనకాలనీకి వెళ్లి కాలనీవాసులు, అధికారులు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఇళ్లు, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో జలజాక్షి గిరిజనులకు అవగాహన కల్పించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8982
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ. 101.20

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

వెంకటాచలం, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాలెం పంచాయతీ సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాయలంలో జరుగతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్, మేజర్ రాజేష్ కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ క్యాంప్ అధికారి బాలబ్రహ్మాచారి, పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తోటపల్లిగూడూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరుకూరు బస్టాండు సెంటర్‌లో శనివారం సర్పంచు అన్నం శారద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి తాకిడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు దాహాన్ని తీర్చేందుకు మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవళ్లిక, మాజీ ఎంపీటీసీ పాకం వెంకయ్య, అన్నం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి వసతి ఏర్పాటు

రాపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు మూడో శనివారం రాపూరు- మద్దెలమడుగు వద్ద ఉన్న అటవీశాఖ కార్యాలయం ఆవరణంలో వేసవి తాపాన్ని తట్టుకోవడానికి స్వచ్ఛమైన మంచినీటిని ఏర్పాటు చేయడం జరిగిందని రాపూరు అటవీశాఖ రేంజి అధికారి పందిళ్ల రవీంద్రబాబు తెలిపారు. అలాగే వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం సాసర్‌లో నీటిని నిల్వ చేయడం జరిగిందన్నారు. అలాగే చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అందులో మట్టి కుండల్లో మంచి నీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు, పాదచారులు అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజి అధికారి ఖాజా రసూల్, వర ప్రసాద్, చంద్రశేఖర్, సల్మాన్ రాజ్, షఫీ, రంజీత్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో బోర్డుల తొలగింపు

పొదలకూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సత్యనారాయణ లే అవుట్‌లో పబ్లిక్‌పర్పస్ స్థలంలో పంచాయతీ అధికారులు నాటిన బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తొలగించారు. అయితే పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఈ స్థలం తమదేనని కోర్టుకెళ్లిన వ్యక్తులే తొలగించారని వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు, సత్యనారాయణ లే అవుట్ స్థిర నివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేటస్ కో ఉన్న ఈ స్థలంలోకి ఎలా ప్రవేశించి హెచ్చరిక బోర్డులు తొలగిస్తారని వారు ప్రశ్నించారు. ఈ వివాదస్పద స్థలాన్ని ఇటీవల పరిశీలించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పబ్లిక్ పర్పస్ స్థలాన్ని ఆక్రమించాలని ఎవరూ చూసినా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించిన విషయం పాఠకులకు విదితమే.

ప్రభుత్వ బడులకు మహర్దశ

● ఒక పాఠశాల అప్‌గ్రేడ్ ● 6 మోడల్, 8 ఫౌండేషన్ స్కూళ్లుగా మార్పు ● రెండు పాఠశాలలు విలీనం

మనుబోలు, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది కొత్త విద్యా విధానం తీసుకురానుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. అందులో భాగంగా మండలంలో ఒక పాఠశాల అప్‌గ్రేడ్ కానుండగా 6 మోడల్, 8 ఫౌండేషన్ స్కూళ్లుగా మార్పు చెందనున్నాయి. మరో రెండు పాఠశాలలు విలీనం కానున్నాయి. గతంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా ఉన్న వాటికి మెరుగులుదిద్ది 6 రకాల పాఠశాలలుగా మార్చారు. మొదటది ఫౌండేషన్, రెండవది మోడల్ ప్రైమరీ, 3వది బేసిక్ ప్రైమరీ, నాలుగవది యూపి, చివరగా హైస్కూల్‌గా మార్చారు. ఈ విధానంతో మనుబోలు మండలంలో బద్దెవోలు, అక్కంపేట ప్రాథమిక పాఠశాలలను రద్దు చేశారు. అందులోని పిల్లలను దగ్గర్లో ఉన్న ఉన్నత పాఠశాల్లోకి విలీనం చేశారు. దీంతో మండలంలో ఉన్న 5 రకాల పాఠశాలల సంఖ్య 50కి చేరుతుంది. కాగా మనుబోలు మండలంలోని గురివిందపూడిలో 8వ తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్క మనుబోలు మండలమే కాకుండా ఈ గ్రామానికి ఆనుకుని ఉన్న వెంకటచలం మండలానికి చెందిన రామదాసుకండ్రిగ, జంగాల పల్లి గ్రామాల పిల్లలు ఈ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. దీంతో ఈ ఏడాది పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ 9వ తరగతి మంజూరు చేశారు. దీంతో వెంకటాచలం మండలంలోని నాయుడుపల్లి, పలుకూరువారిపాళెం గ్రామాల పిల్లలు ఈ పాఠశాలకు రావచ్చునని ఉపాధ్యాయులు, గ్రామస్థులు భావిస్తున్నారు.



హైస్కూల్‌గా మారనున్న గురివిందపూడి పాఠశాల

మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఇవే...

మనుబోలులో మండలంలోని ఆరు పాఠశాలలను కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చారు. అందులో మనుబోలు మెయిన్, మనుబోలు సీఎంనగర్, వెంకన్నపాళెం, కేఆర్ పురం మెయిన్, వీరంపల్లి మెయిన్, మడమనూరు మెయిన్ పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చారు. అంటే గతంలోవలె ఈ పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతి వరకు ఉంటాయి. అందుకు తగిన టీచర్లు ఉంటారు. గత ప్రభుత్వంలో ఈ పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన విద్యార్థులంతా ఈ ఏడాది నుంచి తిరిగి ఈ పాఠశాలలకు రావాల్సి ఉంటుంది.

రూ.10 లక్షలతో రెండు గదులు



గురివిందపూడి పాఠశాలను అప్‌గ్రేడ్ చేయించినందుకు మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మా గ్రామం తరపున ధన్యవాదాలు. అప్‌గ్రేడ్ వలన చుట్టు పక్కల గ్రామాల పిల్లలకు ఎంతో ఉపయోగం. కాగా రూ.10లక్షలతో రెండు గదులు నిర్మాణం చేయిస్తున్నా.

\- సర్వేపల్లి శివకుమార్ శర్మ, టీడీపీ నేత

కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం


దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ, కార్యనిర్వహణాధికారి, తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడ ఆలయంలో శనివారం అంకురార్పణతో ప్రారంభమైన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలకు ప్రముఖులను ఆలయ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి శనివారం వారి నివాసాలు, కార్యాలయాలకు ఆలయ అర్చకులతో వెళ్లి ఆహ్వానించారు. రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోదరుడు గిరిధర్‌రెడ్డిని, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని, ఎస్పీ జి కృష్ణకాంత్‌ను వారి నివాసాలు, కార్యాలయాలకు వెళ్లి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

విడవలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో వున్న సీతారామాలయంలో శనివారం సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ పూజారులు స్వామి, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈవేడుకలకు ఉభయకర్తలుగా భక్తాని రాము, పాపింగారి సుబ్రహ్మణ్యం, బక్తాకి శివకుమార్, విజయకుమార్, కోడి ఏడుకొండలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు బ్రహ్మయ్య, కొడి వెంకటేశ్వర్లు, పాపింగారి రామస్వామి, టీడీపీ నాయకులు ఆవుల వాసు, తూళ్లూరు మాధవ్, తిమ్మరాజు తిరుపతి, కొండా రఘు గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల పరిశీలన

కొడవలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొడవలూరులో పశువుల ఆసుపత్రిలో పశువులు, పక్షుల కోసం నిర్మించిన నీటి తొట్టిని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విద్యారమ పరిశీలించారు. వేసవికాలంలో ప్రతి ఒక్కరూ ఇంటి మీద కూల్ పెయింట్ వేయించుకోవాల్సిందిగా సూచించారు. తద్వారా కొంత ఉపశమనం పొందవచ్చన్నారు.

కోవూరులో ఘనంగా తిరంగా ర్యాలీ



కోవూరులో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

కోవూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తిరం గా ర్యాలీని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బజారు కూడలి నుంచి ప్రారంభమైన ప్రదర్శన తహసీల్దారు కార్యాలయానికి చేరుకుంది. 100 మీటర్ల జాతీయ జెండాతో సాగిన ప్రదర్శనలో యువకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, వీరేంద్రనాయుడు, అడపాల శ్రీధర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తిరుమూరు అశోక్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ఇండ్ల రాఘవేంద్ర, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత నేపధ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 10వ వార్డు పరిధిలోని హరివిల్లు ప్రాంతంలో కమిషనర్ బాలకృష్ణ అధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలో ఎక్కువగా తిరిగి వడదెబ్బకు గురికావద్దని కోరారు. ప్రతి ఒక్కరూ మజ్జిగ, మంచినీళ్ళు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, సెక్రటరీలు, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క ఎకరా ఎండకుండా చర్యలు : డీఈ

విడవలూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక్క ఎకరా ఎండకుండా చివరి అయకట్టు వరకు సాగునీటిని అందజేస్తామని ఇరిగేషన్ శాఖ డీఈ పెంచలయ్య తెలిపారు. విడవలూరు రైతాంగానికి సాగునీరు అందించే ఈస్ట్రన్ చానల్ కాలువని ఆ కాలువ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డితో కలసి శనివారం అయన పరిశీలించారు. 4వ మైలు నుంచి 19 మైలు వరకు కాలువలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగిస్తూ నీటి మట్టాన్ని అదుపుచేస్తూ చివరి అయకట్టునకు నీరు పారేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ పెంచలయ్య మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి సహకారంతో రైతులకు సాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ పరిశీనలలో ఇరిగేషన్ ఏఈ సురేష్, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, మే 17 (ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యం వల్ల ఎటువంటి దుష్ప్రభాలు వుండవనీ, ఆరోగ్యవంతమైన సమాజమే హోమియో వైద్యం లక్ష్యమని హోమియో వైద్యురాలు జ్ఞాన ప్రసూన తెలిపారు. శనివారం బుచ్చిలోని శాఖా గ్రంథాలయంలో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు హోమియో వైద్య సేవలపై అవగాహన కల్పించారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

రీసర్వేపై రైతుల్లో అసంతృప్తి


రోవర్ లేకుండానే రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న సర్వే సిబ్బంది

మనుబోలు, మే 17(ఆంధ్రజ్యోతి): మనుబోలులో ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టిన రీసర్వేపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రీసర్వే హడావుడిగా చేస్తున్నారే తప్ప, సక్రమంగా కొలతలు తీసి, రైతు ల నుంచి సరైన వివరాలు తీసుకుని, సందేహాలు ఉంటే నివృత్తి చేయ కుండానే సర్వే బృందాలు హడావుడిగా చేస్తుండడంతో ఇదేమి రీసర్వే అంటూ అసహనంతో ఆగ్రహం చెందుతున్నారు. మండలానికి నాలుగు రోవర్లు (కొలతలు తీసే యంత్రం) మాత్రమే ఉన్నాయి. రీసర్వేకు మాత్రం 10 బృందాలు ఏర్పాటు చేశారు. దీంతో 6 బృందాలు రోవర్లు లేకుండానే రీసర్వే చేస్తున్నాయి. పొలం వద్దకు వెళ్లడం, నువ్వేనా రైతు, ఇవి మీ పొలాలేనా అని అడగడం, నమోదు చేసుకుని వచ్చేయడం తప్ప ఎంతపొలం ఉంది, రికార్డుకు సరిపడా విస్తీర్ణం ఉందా, తక్కువ, ఎక్కువలు ఉన్నాయా సరిచూడడం లాంటివేమి చేయడం లేదని రైతులు వాపోతున్నారు. రోవర్లు లేకుండానే ప్రభుత్వం రీసర్వే ఎలా చేయి స్తుందని, అలాంటప్పుడు భూముల విస్తీర్ణాలు, సర్వేనెంబర్ల మార్పు జరిగితే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతామని, దీనిపై అధికారులు ఆలోచించాలని మనుబోలు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. రోవర్‌తో సర్వే చేసిన రైతులకు న్యాయం జరుగుతుందని, రోవర్ లేకుండా రీసర్వే చేస్తే, తప్పిదాలు వచ్చి భూములు కోల్పోతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొదలకూరులో పోలీసు చలివేంద్రం

పొదలకూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పొదలకూరులో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని శనివారం సీఐ శివరామకృష్ణారెడ్డి ప్రారంభించారు. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీహైడ్రేషన్‌ను తట్టుకునేందుకు ఎక్కువగా మంచినీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రసూల్, షరీఫ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సైనికులారా సలాం

● ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, నాయకులు

ముత్తుకూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ సైనికులారా సలాం అంటూ శనివారం జరిగిన తిరంగా ర్యాలీతో ముత్తుకూరులో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండు సెంటర్ వరకు సాగింది. కార్య క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై అంటూ అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

టీడీపీ నేతకు నివాళి

వెంకటాచలం, మే 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామదాసు కండ్రిగ పంచాయతీ నాయుడుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మల్లి తిరుపాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయుడుపాలెంలోని వారి నివాసానికి వెళ్లి తిరుపాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరా మర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సోమిరెడ్డి మాట్లా డుతూ టీడీపీ అంకితభావంతో పనిచేసే నేతను కోల్పోయిందని, తిరు పాలయ్య కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, టీడీపీ మండల సీనియర్ నేత కట్టంరెడ్డి రాధా కృష్ణారెడ్డి, ఇడిమేపల్లి మాజీ ఎంపీటీసీ చాట్ల వెంకటసుబ్బయ్య, వెంకటాచ లం మాజీ సర్పంచు వలిపి మునుస్వామి, స్థానిక నేతలు ఉన్నారు.

C.R.I.M.E N.E.W.S

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన ఆరుగురు నిందితులను సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంతపేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ దశరధరామారావు వెల్లడించారు. సంగం మండలం మర్రిపాడుకుకు చెందిన శనగ వీరరాఘవయ్య పది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లారు. 14వ తేది తెల్లవారుజామున ఆయన రైలులో నెల్లూరుకు చేరుకున్నారు. రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా సింహపురి హోటల్ వద్ద గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లలో వచ్చి అతనిని అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.1000 దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరధరామారావు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులుగా ఓల్డ్ చెక్‌పోస్ట్ ప్రాంతానికి చెందిన షేక్ నవాజ్, నెల్లూరు రూరల్ ప్రాంతం నవలాకుల తోటకు చెందిన షేక్ షాహుల్, జాకీర్ హుసేన్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ కేరాఫ్ అబ్దుల్ అజీజ్, నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకు చెందిన భీమవరపు బాస్కర్, మరో ఇద్దరు బాల నేరస్థులను గుర్తించారు. వారిని శనివారం ఉదయం సింహపురి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి కత్తి, రూ.1000, రెండు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : దానపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున వేదాయపాలెం-నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 35-40 ఏళ్ల మృతుడు స్కైబ్లూ వైట్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు, బిస్కెట్ కలర్ బెల్ట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న డ్రైవర్ రాజా

కావలి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం కావలి మండలం గౌరవరం సమీపం లోని జాతీయ రహదారిపై జరిగింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ చెన్నై నుంచి హైదరాబాద్‌కు కెమికల్ ప్యాకేజీ లోడుతో బయలు దేరింది. మార్గమధ్యం లోని గౌరవరం సమీపంలో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ రాజాను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

15 సవర్ల బంగారు నగలు చోరీ

● క్లూస్‌టీం పరిశీలన

చేజర్ల మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చేజర్లకు చెందిన ఖాదర్‌బాష తన ఇంట్లో ఉన్న 15 సవర్ల బంగారు నగలు చోరీకి గురైనట్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు శుక్రవారం తన కుమారుడిని నెల్లూరులోని ఆసుపత్రిలో ఆరోగ్యం చూపించేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని దుస్తులు, వస్తువులు కిందపడి ఉన్నాయని, బంగారు నగలు చూసుకోగా లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఇంట్లో తన తల్లి మాత్రమే ఉండగా, మధ్యాహ్నం సమయంలో ఆమె నమాజు కోసం కింద ఉన్న ఇంటిలోకి వెళ్లిందని, ఆ సమయంలో చోరీ జరిగి ఉంటుందని వాపోయాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్‌టీంతో పరిశీలించామని ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. కర్నాటక రాష్ట్రం బీజాపూర్ గాంధీనగర్‌కు చెందిన హనుమంతుకు భార్య పిల్లలున్నారు. ఆయన పదేళ్లుగా చెన్నై పల్లవరం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికుడుగా పని చేస్తున్నారు. హనుమంతు వరుసకు తమ్ముడైన తిమ్మయ్యతో కలిసి పనిపై శుక్రవారం సాయంత్రం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో హనుమంతు అనారోగ్యానికి గురవ్వడంతో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు చేరుకున్నారు. అక్కడి నుంచి చెన్నైకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో అక్కడికి వచ్చి అకారణంగా హనుమంతుతో గొడవపడ్డారు. బండరాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకునే లోపు వారు పరారయ్యారు. గాయపడిన హనుమంతును 108 సిబ్బంది చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమయంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు అందడంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులు వేదాయపాలెం ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

నూకనపల్లిలో ఇంటిపై పిడుగు పడి దెబ్బతిన్న పిట్ట గోడ



కలువాయి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. నూకనపల్లి గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడి పిట్టగోడ దెబ్బతింది. మిద్దె ఇంటి పిట్టగోడకు ఇనుప పైపు ఏర్పాటు చేసి దానికి విద్యుత్ టాప్ లైటు ఏర్పాటు చేశారు. పిడుగు టాప్‌లైటుపై పడటంతో పిట్టగోడ నిలువునా పగిలిపోయింది. కలువాయిలో కూడా భారీ శబ్ధంతో మెరుపులు రావడంతో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయినట్లు పలువురు తెలిపారు. ఇన్వటర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు దెబ్బతిన్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు ధాన్యం అమ్మకుండా పొలాల్లో నిల్వ ఉంచారు. తడవకుండా పట్టలు కప్పినా కింది వైపు నుంచి లోపలికి నీరు వెళ్లి తడస్తుయని రైతులు ఆందోళన చెందారు.



రాజరాజేశ్వరి ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ఏర్పాటుకు సంబంధించి పాత ధ్వజ స్తంభంకు పూజలు చేసి పోలీసు, రెవెన్యూ శాఖల సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఉదయం రాజరాజేశ్వరి ఆలయం స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, వేద పండితులు రామకృష్ణ, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పది వేల కిచెన్ గార్డెన్ల ఏర్పాటే లక్ష్యం : కలెక్టర్



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఆనంద్, కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరు(సిటీ), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 10 వేల కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నెల్లూరులోని రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్ద నిర్వహించిన బీట్ ద హీట్ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిచెన్ గార్డెన్లు ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు. దీనివల్ల పెరుగుతున్న ఉష్ణోగ్రతలను కొంతమేరకు తగ్గించేందుకు అవకాశం ఉందన్నారు. నెల్లూరు నగరంలో పెరుగుతున్న భవన నిర్మాణాలతో ఇంటి ఉష్ణోగ్రత్తలు ఘనణీయంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అధిగ మించాలంటే ప్రతి ఇంట్లో కిచెన్, రూఫ్‌టాప్ గార్డెన్స్ పెంచడమే శరణ్యమని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఈ సారి పర్యావరణ హితం కోసం 'బీట్ ద హీట్ చేపట్టామన్నారు. ఇప్పుడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

● నీరజకు అభినందన

పొదలకూరు రోడ్డులోని లేక్‌వ్యూ కాలనీలో నివాసముంటున్న ప్రైవేట్ ఉపాధ్యాయిని నీరజ ఇంటికి వెళ్లిన కలెక్టర్ అక్కడ వరండాలో, మిద్దెపైన కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను చూసి ఆమెను అభినందించారు. ఈ విధంగా ఇంట్లో మొక్కలు ఎలా పెంచుతున్నారని, అందుకు స్ఫూర్తి ఎవరని ఆరా తీశారు. తన ఇంటి అవసరాలకు ఉపయోగపడే కాయకూరలు, పండ్లు, పూలు ఈ తోటలోనే వస్తాయని ఆమె చెప్పడంతో మహిళలు ఆమెను ఆదర్శనంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమలో జేసీ కార్తీక్ పాల్గొని మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

నెల్లూరు(క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పేర్కొన్నారు. శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం జంక్షన్‌లో బీట్ ద హీట్ అంశంపై పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. అనంతరం చలివేంద్రం ప్రారంభించి, ట్రాఫిక్ పోలీసులకు హ్యాట్స్, కూలింగ్ గ్లాసుల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,



ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, కూలింగ్ గ్లాస్‌లు అందిస్తున్న ఏఎస్పీ సౌజన్య

సిబ్బంది పాల్గొన్నారు.

● టిడ్కో గృహ సముదాయాల్లో..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం అల్లీపురంలోని టిడ్కో గృహసముదాయాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తండ్రి కొణిదెల వెంకటరావు పేరుపై, ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తల్లిదండ్రులు అనంతరామయ్య, కామేశ్వరమ్మ పేర్లమీద చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు గురికావద్దు : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండతీవ్రకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది.



మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ఆమె మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డీపీఎంవో డాక్టర్ రమేష్, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, మలేరియా అధికారి హుస్సేనమ్మ, డెమో కనకరత్నం, న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో ప్రతిజ్ఞ



జీజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందితో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులగౌడ్, సభ్యులు మల్లికార్జున, బహ్మానాయుడు, అబిదాసుల్తానా, మొగరాల సురేష్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

● మొక్కల పంపిణీ

తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్మవరపు సుబ్బారావు మెప్మా గ్రూప్ సభ్యులతో కలిసి 47వ డివిజన్‌లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మహిళలకు మొక్కలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్, నేతలు భాస్కర్, సిద్ధకళాచారి, కంచికృష్ణ, కల్వగుంట్ల సుధా, మునికృష్ణ, వెంకటశేషయ్య, మెప్మా గ్రూప్ సభ్యులు ఉష, సుజాత, వసంత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలి



వీపీసీ వద్ద మొక్కలు నాటుతున్న డీడీ సోమయ్య పక్కనే ఏడీ యశోధ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), మే 17(ఆంధ్రజ్యోతి): వేడిగాలులు, ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందాలంటే చెట్లు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్క నాటాలని నెల్లూరు వెటర్నరీ పాలీక్లినిక్ (వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.సోమయ్య పేర్కొన్నారు. స్వర్ణఆంధ్ర, స్వచ్ఛఆంధ్రలో భాగంగా నెల్లూరు రైల్వే ఫీడర్సురోడ్డులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయ ప్రాంగణంలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. అంతేకాకుండా మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయం మేనేజర్ శ్రీనివాసులు, ఏడీ డాక్టర్ యశోధ, డాక్టర్ మంజునాథ్ సింగ్, లక్ష్మీప్రసూన, సీనియర్ అసిస్టెంట్ మాధవయ్య, జూనియర్ అసిస్టెంట్ హేమంత్ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

25 రోజుల్లో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం : రూరల్ ఎమ్మెల్యే



శంకుస్థాపన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఈ రోజు శంకుస్థాపన చేసిన రోడ్డు, డ్రైనేజీలను 25 రోజుల్లో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్‌లోని 20వ డివిజన్ కావేరి అవెన్యూలో రూ.33 లక్షలతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు లేని ఈ సమయంలో ప్రజల కష్టాలను తీర్చడమే ప్రధాన అజెండా అని తెలిపారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అందరిని కలుపుకుని ఐక్యంగా అభివృద్ధి ఫలాలను అందిండమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, అధికారుల సహకారంతో రూరల్‌లోని ప్రజలకు కనీస వసతులు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూలో నెల్లూరు విద్యార్థిని ప్రతిభ

● శ్రీవైష్ణవికి 2 బంగారు పతకాలు అందజేసిన గవర్నర్



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి బంగారు పతకాలు అందుకుంటున్న శ్రీవైష్ణవి

నెల్లూరు (విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) బీటెక్ (ఈసీఈ) విభాగంలో నెల్లూరుకు చెందిన వావింట శ్రీవైష్ణవి రెండు బంగారు పతకాలు అందుకుంది. శనివారం అనంతపురంలోని ఆ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శ్రీవైష్ణవి ఈ పతకాలను అందుకున్నారు. అలాగే బీటెక్ అవార్డు ఆఫ్ డిగ్రీని కూడా గవర్నర్ అందచేశారు. కాగా, శ్రీవైష్ణవి తల్లిదండ్రులు వావింటపర్తి కరుణానిధి పాత్రికేయవృత్తిలో ఉండగా, తల్లి నాగలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. బంగారు పతకాలను అందుకున్న శ్రీవైష్ణవి మాట్లాడుతూ ఇస్రో లేదా డీఆర్‌డీఓలో శాస్త్రవేత్తగా చేరి దేశానికి సేవలందిస్తానని చెప్పారు.

పౌష్టికాహారంతో క్రీడాకారుల్లో ఉత్సాహం

● డీఎస్‌డీవో యతిరాజ్



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వాకర్స్ సంఘం సభ్యులు

నెల్లూరు(విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు నిత్యం పౌష్టికాహారం అందించి ప్రోత్సహించడంతో వారు మరింత ఉత్సాహం గా క్రీడల్లో సాధన చేస్తారని డీఎస్‌డీవో ఆర్‌కె. యతిరాజ్ అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బా రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల కు అందించే ఉచిత పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ శివరామ్ ప్రసాద్, పౌష్టికాహార దాత బెజవాడ సునీల్‌రెడ్డి, వివేకానంద వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, సభ్యులు సుబ్బరాజు, చంద్ర మౌళి, ఖలీల్ బేగ్, సభ్యులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన పెంచుకోవాలి

● ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య



డాక్టర్ ఎంవీ రమణయ్యను సన్మానిస్తున్న పీహెచ్‌పీ నేతలు

నెల్లూరు(వైద్యం), మే 17(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు రక్తపోటుపై అవగాహన పెంచుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మేకల వెంకట రమణయ్య సూచించారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్(పీహెచ్‌పీ)లకు రక్తపోటుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, యాంత్రిక జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం, నిద్రలేమి, వంశపారపర్యం కారణాల వల్ల రక్తపోటుకు దారితీస్తాయని వెల్లడించారు. అనంతరం పీహెచ్‌పీలు డాక్టర్ ఎంవీ రమణయ్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, చిట్టూరి వీరయ్య, ఉప్పలపాటి రామదాసు, ఖాజావలి, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

'వేదగిరి' బ్రహ్మోత్సవాలు విజయవంతం

నెల్లూరురూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రంలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు విజవంతంగా జరిగాయని ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ శంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం దేవస్థానంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ మొదలైన బ్రహ్మోత్సవాలు 16 వరకు సాగాయన్నారు. ఈసారి నరసింహకొండకు భక్తులు భారీగా తరలివచ్చి జయప్రదం చేశారన్నారు. ఉభయకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 17(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థల్లో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరిగాయి. వరల్డ్ టెలికాం డే సందర్భంగా టెలికమ్యూనికేషన్ ఉపయోగాలను గురించి ప్రసంగించారు. అనంతరం పుస్తక పఠనం జరిగింది. ప్రజా సైన్స్ వేదిక నెల్లూరు అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్ బీపీ దినోత్సవం సందర్భంగా బీపీ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ ప్రసన్న యోగా తరగతులు నిర్వహించారు. డాన్సు మాస్టర్ నారాయణ మూర్తి నాట్యంలో బేసిక్ ట్రిప్స్ నేర్పించారు. ఈ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, ప్రసాద్, సిబ్బంది, పర్యవేక్షించారు.

20న తలపెట్టిన సమ్మె వాయిదా

నెల్లూరు(వైద్యం), మే 17(ఆంధ్రజ్యోతి) : ఈనెల 20వ తేదీన తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు పలు సంఘాల నేతలు వెల్లడించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాంబాబు మాట్లాడారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు, పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం కారణంగా సార్వత్రిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే 20వ తేదీన సమ్మె వాయిదా పడినందున అదేరోజు నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ, ఆర్టీసీ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్టీయూ న్యూ జిల్లా నాయకుడు యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఇద్దరు మంత్రుల పర్యటన

నెల్లూరు(సాంస్కృతికం), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ పర్యటించనున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో జరిగే శ్రీపొట్టిశ్రీరాములు 125వ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కావలి పట్టణంలో పరివార సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం జరిగే మహాకుంభాభిషేకంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం నుంచి సత్రం సెంటర్ వరకు జరిగే ఆపరేషన్ సిందూర్ తిరంగా ర్యాలీలో పాల్గొంటారు.

● రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఉదయం 9గంటలకు బయలుదేరి మినీబైపాస్ రోడ్డులో పరమేశ్వరి మహేశ్వరి కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలన. 11.30 గంటలకు ఎస్‌బీఎస్ కళ్యాణ మండపంలో పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



పెంచలోరుకు కల్యాణం జరుపుతున్న అర్చకులు

రాపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : తరలి వచ్చిన భక్తజనంతో పెంచలకోన క్షేత్రం కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడం, పాఠశా లలకు సెలవులు ఉండడంతో శుక్రవారం రాత్రికే భక్తులు కోనకు చేరుకున్నారు. శనివారం తెల్లవారు జామున జరిగే శ్రీవారి అభిషేకంలో పాల్గొన్నారు. ఉదయం దేవేరు లతో కల్యాణం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవ కార్యక్రమాలను అర్చకులు సంప్రదా యబద్ధంగా జరిపారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాదరం కుటుంబ సమేతంగా స్వామివారిని, ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి, ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పగలు సెగలు.. రాత్రి చినుకులు!



ఉదయగిరి రహదారులపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

ఉదయగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండదెబ్బకు ప్రజలు విలవిల్లాడారు. మధ్యాహ్న నుంచి ఆకాశం మేఘావృతమై ఉదయగిరి దుర్గాన్ని సైతం కమ్మేసింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా మురుగు కాలువలు పొంగిపొర్లి వ్యర్థాలన్నీ రహదారులపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్, రహదారులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

● పిడుగుకుపాటుకు మేకల మృతి

మండలంలోని జీ.అయ్యవారిపల్లి పంచాయతీ దేకూరుపల్లిలో శనివారం రాత్రి పిడుగుపాటుకు ఐదు మేకలు మృతి చెందాయి. సుమారు రూ.50వేలు నష్టపోయినట్లు రౌతుల పేరయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి నగదు రికవరీకి సిఫారసు

● ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైన నివేదిక

నెల్లూరు (హరనాధపురం) మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం రెండేళ్లుగా వివాదాస్పదంగా వార్తల్లో నిలుస్తోంది. నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యోగులు పదోన్నతులు పొందారని, వేత నాలు అందుకు అనుగుణంగా తీసుకున్నారని, కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖలోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ అధికారులతోపాటు కిందిస్థాయి సిబ్బందిపై గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణ లు నిజమేనని జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి నివేదికలో తేటతెల్లమైనట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా వేతనాలు పొందారని, ట్రావెలింగ్ అలవెన్సులు, కారు అద్దెలు తదితర వాటిల్లో రూ.16.74లక్షల నగదు దుర్వినియోగం అయినట్లు ఆడిట్ రిపోర్టులో తేలినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని ఉద్యోగుల నుంచి రికవరీ చేయడంతోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసినట్లు సమాచారం. గతంలో నెల్లూరుకు చెందిన న్యాయవాది పాముల హరిప్రసాద్,లోకాయుక్తను ఆశ్రయించి ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై కూలంకషంగా వివరించారు. నాటి నుంచి ఎస్సీ కార్పొరేషన్‌లో కలకలం మొదలైంది.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నెల్లూరు(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ-1. 2, కామర్స్-1, 2 పరీక్షలతో ప్రశాంతగా ముగిసినట్లు ఆర్ఐవో టీ.వరప్రసాదరావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 8,681 మంది హాజరు కావాల్సి ఉండగా 7,965 మంది హాజర య్యారని, 716 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1085 మంది హాజరు కావాల్సి ఉండగా 1022 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తం మీద ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌లు లేకుండా పరీక్షలను పూర్తి చేశామని, సోమవారం నుంచి స్పాట్ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు.

ఎస్ఎస్ఏలో పారెన్ సర్వీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

● 22న సెక్టోరియల్ పోస్టులకు రాత పరీక్ష

సమగ్రశిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసు కున్న ఉపాధ్యాయులకు ఈనెల 22వ తేదీన నగరంలోని పత్తేఖాన్‌పేట మునిసిపల్ ఉన్నత పాఠశా లలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 వరకు అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఎంఐఎస్ మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు, 3 నుంచి 5 గంటల వరకు అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరూ పరీక్షకు తప్పక హాజరు కావాలని తెలిపారు.

నెల్లూరు(విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పారెన్ సర్వీస్ పోస్టుల్లో డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన ఎస్ఏల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీ నాటికి 55 ఏళ్ల లోపు వయస్సు కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లు అర్హులని పేర్కొన్నారు. వీరు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎస్ఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలని తెలిపారు. విద్యార్హతలు, మార్కుల జాబితాలు, అనుభవం, ఇతర అన్ని సర్టిఫికెట్స్‌పై సంబంధిత అధికారితో అటెస్టెట్ చేయించి దరఖాస్తులకు జతపరిచి స్వయంగా కార్యాలయంలో అందించాలని తెలిపారు.

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోరిన కోరికలు తీర్చే కరుణామయి కామాక్షితాయి!

కోరిన కోరికలు తీర్చే కరుణామయి జొన్నవాడ కామాక్షితాయి, మల్లికార్జునస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 11 రోజులపాటు రోజుకో వాహనంలో ఆదిదంపతులు భక్తులకు దర్శనం ఇస్తారు. 27వ తేదీతో ముగియనున్న ఈ ఉత్సవాలకు తెలుగురాష్ట్రం లోని నలుమూలల నుంచి భక్తజనం భారీగా తరలిరానుంది.

- బుచ్చిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి)

● పెన్నాలో జాలరు వలకు చిక్కిన కాత్యాయిని.. ఆదిశంకరాచార్యులతో విగ్రహ పునఃప్రతిష్ఠ

● కశ్యప్రజాపతి యజ్ఞంతో స్వయంభువుగా మల్లికార్జునస్వామి



కామాక్షితాయి అమ్మవారు

2వ శతాబ్దానికి పూర్వం జొన్నవాడ ఓ కుగ్రామం. ఇక్కడ పెన్నా నదిలో చేపల వేటతో జీవనం సాగించే జాలర్లలో ఓ జాలరుకు వలలో చేపలకు బదులు ఓ శిలావిగ్రహం లభ్యమైంది. ఆ విగ్రహాన్ని జాలర్లంతా ప్రస్తుతం ఉన్న ఆలయ పరిసర ప్రాంతంలోని ఓ చోట ప్రతిష్ఠించి నిత్యం మాంస, శాఖాహారాలను నివేదించే వారు. పరిణామ క్రమంలో ఆ శిలా విగ్రహంలోనుంచి ఓ ఆదిశక్తి రూపం అర్ధరాత్రి పూట గ్రామంలో తిరుగుతూ ఎదురుపడ్డ మనుషులు, మూగజీవాలను బలితీసుకునేదని స్థానిక పెద్దలు నేటికీ చెబుతుంటారు.

● కామాక్షితాయిగా పునఃప్రతిష్ఠ

దేశ పర్యటనలో భాగంగా కంచి కామకోటి పీఠాధిపతి (మొదటి) జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు జొన్నవాడ పెన్నానదీ తీరాన బస చేశారు. ఆ రాత్రి శంకరాచార్యుల దివ్యదృష్టికి ఆ ప్రాంతంలో సంచరించే ఆదిశక్తి రూపన్ని పసిగట్టి ఆ శక్తిరూపాన్ని అడ్డుకుని ఆ విగ్రహంలోని ఆదిశక్తిని పారద్రోలి లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి అంశాలను నెల కొల్పి 'కామాక్షితాయి' అని నామకరణం చేశారని చెబుతారు. అప్పటి నుంచి అమ్మవారి ఆలయంలో ఆదిశంకర పీఠం ఆచార సంప్రదాయాలతో శాస్త్రోక్తంగా పూజలు, అభివృద్ధి జరుగుతోంది.



పెన్నానదిలో జాలర్లకు వలలో అమ్మవారు దొరికినట్లు అంతరాలయంలో చెక్కబడిన చిత్రం

● మల్లికార్జునస్వామి స్వయంభువు

త్రేతా యుగంలో కశ్యపజాపతి జొన్నవాడ పెన్నానది ఒడ్డున త్రేతాగ్నులను నెలకొల్పి యజ్ఞం చేయగా ఆ యజ్ఞంలో ఓ కుండలం నుంచి సాక్షాత్తు పరమ శివుడు లింగాకారంతో ఆవిర్భవించారు. మల్లికార్జునుడనే నామంతో జొన్నవాడలో భక్తుల కోర్కెలు తీర్చేలా స్కంధపురాణంలో పేర్కొనబడి ఉన్నట్టు పండితులు చెబుతున్నారు. అలా సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులే పవిత్ర పెన్నానదీ తీరాన వెలసి భక్తజనం పూజలతో జొన్నవాడ (రజితగిరి) పుణ్యక్షేత్రంగా అలరారుతోంది.



కశ్యప్రజాపతి చేసిన యజ్ఞంలోనుంచి ఆవిర్భవించిన మల్లికార్జునస్వామి

● కశ్యపతీర్థం

కశ్యప్రజాపతి జొన్నవాడలోని ఆలయం పక్కన పెన్నానది వద్ద యజ్ఞం చేసిన రేవే పవిత్ర కశ్యప తీర్థం రేవుగా పిలుస్తారు. శాపగ్రస్తుడైన అశ్వద్ధ మహాముని కుష్టువ్యాధితో బాధపడుతూ జొన్నవాడలోని కశ్యపతీర్థం రేవులో స్నానమాచరించి వ్యాధి నుంచి విముక్తి పొందాని పండితులు తెలిపారు.

● భక్తులకు స్వప్న దర్శనంతో వరాలు

ఆలయంలో నద్రించిన భక్తులకు ఆదిదంపతులు స్వప్న దర్శనంలో కోరిన కోర్కెలు తీరుస్తుంటారు. ప్రధానంగా సంతానలేమితో బాధపడే మహిళలు బ్రహ్మోత్సవాలు, నవరాత్రి ఉత్సవాల సమయంలో 10రోజుల పాటు తడిబట్టలు, ఉపవాసాలతో కఠోర దీక్షబూని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిముఖంగా నిద్రించి సంతాన వరాలు పొంది ఏడాదికి తిరిగి బిడ్డతో స్వామి, అమ్మవార్లను దర్శిస్తుంచుకుంటారు. ఇక నిత్యాన్నదానానికి భక్తులు లక్షలాది రూపాయలు విరాళాలుగా సమర్పిస్తుంటారు. ఆరోగ్య, ఆర్థిక, విద్య, సంతాన, మానసిక సమస్యలు, సకల సమస్యలతో సతమతమవుతూ స్వామి, అమ్మవారి శరణుకోరి వచ్చే భక్తులను కాపాడుకుంటున్నారు.



జీజీహెచ్‌లో కమిటీ సభ్యులు, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

దాతల సహకారంతో మౌలిక వసతులు

● జిల్లా కలెక్టర్ ఆనంద్

● జీజీహెచ్‌లో ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

నెల్లూరు(వైద్యం), మే 17(ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, వైద్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. శనివారం జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రసూతి విభాగంలో మొక్కలు నాటారు. అక్కడ ప్రత్యేక గదులను పరిశీలించి ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఈ గదులు కేటాయించి రుసుము వసూలు చేయాలన్నారు. హెచ్ఐవీ విభాగంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎముకలు, కీళ్ల విభాగంలో కంప్యూటర్ ద్వారా ఎక్స్‌రే ఎలా తీస్తారో స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు దాతల సహకారం కోసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసులగౌడ్, సభ్యులు మల్లికార్జున, అబిదా సుల్తానా, మొగరాల సురేష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్లు వినయ్‌కుమార్, గీతాలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం పొగాకు రైతుల ఆందోళన

కలిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. రెండు నెలల క్రితం పొగాకు కొనుగోళ్ల ప్రారంభం అయినప్పటికీ ధరల్లో పెరుగుదల కనబడలేదన్నారు. పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి కేవలం మొదటి రకం గ్రేడ్ పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తున్నాయన్నారు. మీడియం, లోగ్రేడ్ పొగాకును వేలం కేంద్రానికి తీసుకువస్తే నోబిడ్ ప్రకటిస్తూ తిరస్కరిస్తున్నారన్నారు. ఈవిధంగా తిరస్కరిస్తున్న బేళ్లను తిరిగి ఇళ్లకు తీసుకువెళ్లాలంటే కష్టతరంగా మారిందన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పొగాకు గ్రేడ్‌లను కొనుగోలు చేస్తామని హామీ ఇస్తేగాని ఆందోళన విరమించమని కొంతసేపు వేలం ప్రక్రియను అడ్డుకున్నారు. దీంతో వేలం నిర్వహణ అధికారి ఇసాక్‌స్వరణ్‌దత్ రైతులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి కంపెనీలు కొనుగోలు చెయ్యటం జరుగుతుందన్నారు. రైతుల ఆందోళనను బోర్డు దృష్టికి తీసుకువెళ్లి అన్నిరకాల పొగాకు గ్రేడ్‌లను కొనుగోలు చేస్తామనడంతో రైతులు ఆందోళన విరమించారు.

'అమృత్'పై చర్చా వేదికకు రా!

● పథకంలో జరిగిన అవినీతిని బయటపెడతా

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కు కావలి ఎమ్మెల్యే సవాల్

కావలి, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అమృత్ పథకం కింద మంజూరైన రూ.57 కోట్లలో జరిగిన అవినీతిపై త్వరలో ఏర్పాటు చేయనున్న చర్చా వేదికకు దమ్ముంటే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వచ్చి సమాధానం చెప్పాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సవాల్ విసిరారు. రోడ్డు మార్జిన్ వ్యాపారుల కోసం నిర్మించిన మున్సిపల్ వాణిజ్య సముదాయం దుకాణాలను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. 'అమృత్' ఫైలాన్ కనిపిస్తే ఎక్కడ ఆ నిధులు గుర్తుకు వస్తాయోనని దానిని ప్రెస్‌క్లబ్ పేరు చెప్పి ధ్వంసం చేయించారని అన్నారు. అలాగే ప్రతాప్‌రెడ్డి చేసిన అవినీతి ఎక్కడ బయటకు వస్తోందోనని మున్సిపాలిటీకి ఎన్నికలు కూడా జరగకుండా చేశారని అన్నారు. అమృతపథకం నిధులు దుర్వినియోగంపై తగిన ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా త్వరలో చర్చావేదిక ఏర్పాటు చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించనున్నట్లు తెలిపారు. దానిపై విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించనున్నట్లు చెప్పారు.

● జూన్ 21న సీఎం రాక

కావలి నియోజకవర్గానికి మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కావలికి ఆహ్వానించానని, జూన్ 21న ఆయన వస్తారని ఎమ్మెల్యే తెలిపారు. జువ్వలదిన్నె ఫిసింగ్ హార్బర్ ప్రారంభోత్సవంతోపాటు కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు మంజూరైన రూ.17 కోట్లతో శంకుస్థాపన వంటి కార్యక్రమాలు సీఎం చేతుల మీదుగా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, టీడీపీ నేతలు కిషోర్, వెంకటేశ్వర్లు, మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

క్వార్ట్జ్ కేసులో విచారణ

నెల్లూరు (క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో నోటీసులు అందుకున్న మాజీ మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మందల వెంకటశేషయ్య శనివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఆయనతోపాటు సురేష్‌కుమార్‌రెడ్డి విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మీడియాతో మాట్లాడుతూ డీఎస్పీ విచారణ కోసం బయటకు వెళ్లారని, ఆయన వచ్చాక సమాచారం అందిస్తామని అప్పుడు విచారణకు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరయ్యేదుకు సిద్ధంగా ఉన్నామని, ఈ కేసులో తమ పాత్ర ఏమీలేదనానరు. ఈ నెల 30వ తేదీ వరకు తాను జిల్లాలో ఉండనని, ఆపై ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని తెలిపారు.

గడ్డివామి దగ్ధం: రూ. 50 వేల నష్టం

సంగం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపాళెంలో వెంకటరమణయ్య అనే రైతుకు చెందిన గడ్డివామి శనివారం దగ్ధమైంది. వెంకటరమణయ్యకు పాడి పశువులు ఉండడంతో వాటికి మేత కోసం ఇటీవల గడ్డి కొనుగోలు చేసి రహదారి పక్కన ఖాళీ స్థలంలో ఉంచాడు. పక్కనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈ క్రమంలో గాలులకు విద్యుత్ తీగలు రాసుకుని నిప్పులు ఏర్పడి గడ్డివామికి మంటలు ఏర్పడి ఉంటాయని స్థానికులు తెలుపుతున్నారు. ఈ సంఘటనతో సుమారు రూ. 50 వేల మేర నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

రాపూరు వాసి దారుణ హత్య



ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసు అధికారులు



షఫీ (ఫైల్

రాపూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో వరుస హత్యలతో ప్రజలు హడలి పోతున్నారు. తాజాగా రాపూరు మండలంలో ఓ దారుణ హత్య కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాపూరు పట్టణానికి చెందిన షేక్. షఫీ (52) ఆర్టీసీ కూడలి వద్ద కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి బయలుదేరాడు. కానీ ఎంత సేపటికి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు షఫీ కోసం గాలించారు. అయితే శనివారం ఉదయం రాపూరు మండలంలోని తాతిపల్లి సమీపంలో ఓ వ్యక్తి హత్యకు గురైనట్లు అక్కడి స్థానికులు కండలేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు షఫీగా నిర్ధారించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఆత్మకూరు సీఐ గంగాధర్, రాపూరు సీఐ సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ, డాగ్ స్క్వాడ్ చేరుకుని పరిశీలిస్తున్నారు. షఫీ ఎలా హత్యకు గురయ్యాడు, కారణాలేమిటనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరుపుతున్న అర్చకులు

సీతారామపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : సీతారామపురం గ్రామ పంచాయతీలోని సంగసానిపల్లి గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆకాశ మంత పందిరి, భూదేవంత పీట. పచ్చని తోరణాలు స్వాగతం పలుకుతుండగా మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో శ్రీరామ చంద్రుడ్ని కల్యాణమండపానికి తరలించారు. మండపానికి చేరుకున్న సీతమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు పారవశ్యంలో మునిగిపోయారు.శ్రీరామునికి సీతమ్మనిచ్చి కన్యాదానం నిర్వహించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య శ్రీరాముడు సీతమ్మకు మంగళ సూత్రధారణ చేశారు.కల్యాణాన్ని వీక్షించుటకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటపల్లి గ్రామంలో శనివారం సీతారాముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్చకులు స్వామి వార్లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం అడ్డదారులు

● కార్పొరేట్ విద్యాసంస్థలో వింత పోకడ

● పోటీ సంస్థల విద్యార్థులకు అన్యాయం జరిగేలా ప్రయత్నాలు

● ఇంటర్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు

● సమగ్ర విచారణకు ఆదేశం

కందుకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : 'అందరికన్నా మేటిగా మా విద్యాసంస్థ ఫలితాలు సాధించింది. మేమే టౌన్ ఫస్ట్... మేము జిల్లా ఫస్ట్ అని ప్రచారం చేసుకోవటం కోసం ఆయా విద్యాసంస్థలు సకలప్రయత్నాలు చేస్తుంటాయి. అడ్డదారిలోనైనా అత్యధిక మార్కులు సాధిస్తే అడ్మిషన్లు ఘనంగా ఉంటాయని విద్యాసంస్థల నిర్వాహకులు పరీక్షల సమయంలో నానాతంటాలు పడుతుంటారు. ఇన్విజిలేటర్లను మచ్చిక చేసుకోవడం, కాపీ కొట్టించడం, మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసుకుని వారికి నాలుగు మార్కులు అదనంగా వచ్చేలా చూసుకోవడం ద్వారా అగ్రగామిగా నిలవాలని పడరాని పాట్లు పడటం మనం చూస్తూనే ఉంటాం. అయితే కందుకూరులో కేవలం వారి ఉన్నతిని చాటుకోవటానికి అడ్డదారులు తొక్కడమే కాదు.. తమది పైచేయి అని చూపించుకోవడానికి ఎదుటివారి చేతిని బలవంతంగా దించేసే ప్రయత్నాలు జరిగాయి. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ ఈ దారుణ చర్యలకు ఒడిగట్టిన విషయం రీ వెరిఫికేషన్‌లో వెలుగులోకి వచ్చింది. విద్యాశాఖ అధికారులు, బాధిత విద్యార్థులు చెప్పిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

● ఇన్విజిలేటర్‌పై ఫిర్యాదు

కందుకూరులోని ఓవీ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ముప్పనేని అవినాష్‌బాబు, తస్నీరు సాయితేజశ్వినిలు ఎంపీసీ పూర్తిచేశారు. వీరిలో అవినాష్‌బాబుకు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 470కి 464 మార్కులు, సాయితేజశ్వినికి 466 మార్కులు వచ్చాయి. అయితే ద్వితీయ సంవత్సరం వచ్చేసరికి అవినాష్‌బాబుకు వెయ్యికి 971 మార్కులే రాగా సాయితేజశ్వినికి 983 మార్కులు వచ్చాయి. వాస్తవానికి వీరిద్దరూ సదరు విద్యాసంస్థలో టాపర్స్. అయితే వీరికన్నా అకడమిక్‌లో వెనుకబడిన విద్యార్థులకు అధిక మార్కులు వచ్చాయి. వీరిద్దరూ పట్టణంలో పేరెన్నికగల ఓ ప్రైవేటు కళాశాలలోని పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాశారు. దీంతో అనుమానం వచ్చి రీ వెరిఫికేషన్‌కు పెట్టించగా అవినాష్, సాయితేజశ్విని ఇంగ్లీషు ఆన్సర్ సీట్లు ట్యాంపరింగ్ జరిగినట్లు ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఇంగ్లీష్ ఎగ్జామినేషన్‌లో ఇన్విజిలేటర్‌గా ఉన్న జీ.కృష్ణారావు ఆ విద్యార్థులు ఆన్సర్ సీటు ఇచ్చి వెళ్లేటప్పుడే 'మీరు 5 మార్కులు అనవసరంగా పోగొట్టుకున్నారుగా..' అని మాట్లాడటాన్ని గుర్తుచేసుకుని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సమగ్ర విచారణకు ఆదేశించారు. సదరు విద్యాసంస్థలో ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్ష సెంటర్‌లో ఇన్విజిలేటర్లను పూర్తిగా మార్చివేసి ప్రభుత్వ అధ్యాపకులతో నడిపిస్తుండటం విశేషం. ఈ వ్యవహారాన్ని నిగ్గుతేల్చి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవటంతోపాటు ఆ విద్యార్థులకు మార్కులు సవరించి న్యాయం చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభయమిచ్చారని బాధిత విద్యార్థులు అవినాష్‌బాబు, సాయితేజశ్విని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ప్రాజెక్టులో అక్రమ చేపలవేటపై దాడి

● జాలర్లపై చర్యలు కరువు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో అక్రమ చేపలవేటపై మత్స్యశాఖాధికారులు శనివారం దాడులు నిర్వహించారు. చేపలను జలాశయం ఎగువ నుంచి ఒడ్డుకు చేరుస్తుండగా కొందరు జాలర్లను తనిఖీ చేశారు. వారి వద్ద లైసెన్సులు లేక పోవడంతో సంపదను స్వాధీనం చేసుకున్నారు. చేపలను వేలం వేయగా రూ 4,500 సమకూరిందన్నారు. ఆ నగదును ప్రభుత్వంకు జమ చేసినట్లు ఏడీ శ్రీనివాసులు తెలిపారు. కాని పట్టుబడిన జాలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై ఏడీ మాట్లాడుతూ మొదటి తప్పుగా వారిని వదిలేశామని, రెండో సారి దొరికితే చర్యలు తీసుకుంటామని చెప్పడం కొసమెరుపు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. సింగనబోయిన కుమారి అనే మహిళపై ఆవుల రత్తయ్య, జక్కుల బాలకృష్ణలు తనతోపాటు తన కుటుంబ సభ్యులు, అడ్డువచ్చిన వారిపై దాడి చేసి, దుర్భాషలాడి కర్రలతో ఇంటిపైకొచ్చారని ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటి నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద మండలంలో అర్హులైన వారు ఇంటి నివేశన స్థలాలు, పక్కాగృహాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ ఇళ్లు అనే పథకాన్ని అమలు చేసిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేసుకున్న లబ్ధిదారులు స్థానిక తహ సీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారు పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తారన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8982
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ. 101.20



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ముత్యాలమ్మకు విశేష కుంకుమార్చన

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్స వాల్లో భాగంగా శనివారం అమ్మవారికి విశేష కుంకుమార్చన, పుణ్యాహవచనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కలువాయి పట్టాభిరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఈవోపీఆర్డీకి అదనపు బాధ్యతలు

వింజమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీశ్రీనివాస్ పంచాయతీ ఈవోగా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న శివకుమార్ సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో గోపీశ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సృజన, జూనియర్ సహాయకులు శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పంచాయతీరాజ్‌లో ప్రక్షాళన ..!

● క్లస్టర్ సచివాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం ● కార్యదర్శుల గ్రేడ్‌లు ఆరు నుంచి నాలుగుకు కుదింపు

ఆత్మకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్‌లో ప్రధానమైన గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముందు చూపు లేకుండా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థను హేతుబద్ధీకరించడంతో పాటు కార్యదర్శుల గ్రేడ్‌లను ఆరు నుంచి నాలుగుకు కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జనాభాకు అనుగుణంగా రెండు, మూడు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసేలా నివేదికను జిల్లా పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరోపక్క గ్రేడ్‌ల తగ్గింపు ప్రక్రియను కార్యదర్శులు సైతం స్వాగతిస్తున్నారు.

పంచాయతీలకు గుదిబండలా...

ప్రజలకు మెరుగైన పాలన పేరిట నాటి వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ గ్రామ పంచాయతీలకు గుదిబండలా మారింది. వివిధ కార్యదర్శుల పేరుతో ప్రతి సచివాలయానికి పది మందికి తగ్గకుండా నియమించి సిబ్బందికి సరైన బాధ్యతలు అప్పగించలేదు. ఆత్మకూరు నియోజకవర్గంలో మొత్తం 93 సచివాలయాలు ఉండగా ప్రస్తుతం 748 మంది ఉద్యోగులు ఉండడం గమనార్హం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మొత్తం 93 సచివాలయాలను 48 క్లస్టర్లుగా విభజించనున్నారు. మరోవైపు సచివాలయాల నిర్వాహణ పంచాయతీలకు అదనపు ఆర్థిక భారంగా మారింది. ఎటువంటి



మురగళ్ల గ్రామ సచివాలయం

అధికారాలు లేని గ్రేడ్-5 కార్యదర్శులుండే సచివాలయాలు కేవలం అలంకారప్రాయానికే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. వీటిని చక్కదిద్దడంతో పాటు సచివాలయాల్లోని సిబ్బంది సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో హేతుబద్ధీకరణ, కార్యదర్శుల గ్రేడ్‌ల మార్పు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

సర్దుబాటుకు నిర్ణయం...

జనాభా, పంచాయతీ ఆదాయ వనరులను దృష్టిలో ఉంచుకుని సచివాలయాలను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లాలో 769 సచివాలయాలున్నాయి. వీటిలో 5,973 మంది సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2,992 క్లస్టర్లుగా సర్దుబాటు చేసేలా అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. తదుపరి చర్యల కోసం ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. హేతుబద్ధీకరణతో సమకూరే సచివాలయ మిగులు సిబ్బందిని ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే సౌలభ్యం ఏర్పడుతుంది.

ఇక నాలుగు గ్రేడులే...

ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు ఆరు గ్రేడ్‌లు అమలులో ఉన్నాయి. ఇన్ని గ్రేడ్‌లు ఉండడంతో బదిలీలు, పదోన్నతుల విషయంలో తలెత్తే ఇబ్బందులు కారణంగా కొన్ని పంచాయతీలకు పూర్తి స్థాయి కార్యదర్శులు లేకుండా పోతున్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఇకపై కార్యదర్శులను స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 మాత్రమే అమలవుతాయి. గ్రేడ్-6 చలామణి అవుతున్న సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను ఏం చేయాలనే విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. వైసీపీ ప్రభుత్వంలో దాదాపు మూడేళ్ల పాటు ప్రొబేషన్‌లో ఉండడమే కాకుండా నోషనల్ ఇంక్రిమెంట్‌లకు నోచుకోక చాలీచాలనీ జీతంతో ఇబ్బందులు పడిన కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో వారి పే స్కేల్ పెరగనుంది.

నియోజకవర్గంలో సచివాలయాలు, క్లస్టర్ల ఏర్పాటు వివరాలు

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు	క్లస్టర్ల ఏర్పాటు
అనంతసాగరం	16	119	8
ఏఎస్‌పేట	13	107	7
ఆత్మకూరు(రూరల్)	11	99	6
ఆత్మకూరు(అర్బన్)	08	74	4
చేజర్ల	15	117	8
మర్రిపాడు	17	117	8
సంగం	13	115	7
మొత్తం	93	748	48

బీట్ ద హీట్.. ఫటాఫట్!

● తూతూమంత్రంగా ర్యాలీలు, అవగాహన
● కనిపించని అధికారులు ● కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ఉదయగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ర్యాలీలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వేసవి దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూగర్భజలాల పెంపుకు చేపట్టాల్సిన చర్యలు, చలివేంద్రాల ఏర్పాటు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో బీట్ ద హీట్ కార్యక్రమం ఫటాఫట్ అయ్యింది. ఎక్కడ చూసినా ఈ కార్యక్రమం తూతూ మంత్రంగానే సాగింది. ఉదయగిరిలో అధిక శాతం వలస ఉద్యోగులే. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలుండదు. దీంతో శనివారం కావడం, ఆదివారం సెలవు కావడంతో పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టడం విశేషం. ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిం చాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో మమ అనిపిస్తూ చేతులు దులుపుకోవడంపై పలువురు మండిపడుతున్నారు.



అవగాహన ర్యాలీలో అరకొరగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సీతా రామపురం గ్రామపంచాయతీని ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ నయీం హసన్ తాజ్ శనివారం తనిఖీ చేసి గ్రామ పంచాయతీ రికార్డు పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీకేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తు లకు, పరిశుధ్య సిబ్బందికి టోపీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, గ్రామంలో సేకరించిన పొడి చెత్త తడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో భార్గవి, మండల పంచాయతీ కార్యద ర్శులు రాంనాధ రెడ్డి, పఠాన్ షఫీ, పరిశుధ్య కార్మి కులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి రైతులు సహకరించాలి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డీసీవో గుర్రప్ప



సొసైటీ వద్ద చలివేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్ప

సంగం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి రైతులు సహకరించాలని జిల్లా సహకారశాఖ అధికారి గుర్రప్ప కోరారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక వ్యవసాయ సహకార సంఘం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో నడిచే పెట్రోలు బంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు బీట్ ద హీట్ ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లాలోని 22 సహకార సంఘాల్లో చలివేంద్రాలు ప్రారంభించి మొక్కలు నాటామన్నారు. సహకార సంఘాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు చేయాలన్నారు. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యాన్ని సుమారు లక్ష మెట్రిక్ టన్నులకు పైగా సీఎంఆర్ కింద ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మార్క్‌ఫెడ్‌తో సొసైటీలకు ఎరువులు సరఫరా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కావలి కో-ఆపరేటివ్ అధికారి తిరుపాల్‌రెడ్డి, సబ్ కో ఆపరేటివ్ అధికారి సుభాషిణి, సొసైటీ సెక్రటరీ దస్తగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

సంగం, (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లా నాయక్ శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మెల్కి రోషన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బి.వెంకటేశ్వర్లు, విశ్రాంత ప్రధానోపా ధ్యాయులు దస్తగిరి అహ్మద్, జాఫర్‌అహ్మద్, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి):పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ శ్రీ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను, భవనం పైన చెత్తచెదారాలను శుభ్రం చేయించారు. ప్రతి మూడవ శనివారం అన్ని కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి : మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్

ఆత్మకూరు, మే 17 (ఆంధ్ర జ్యోతి) : వేసవి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేం దుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ సీ. గంగాప్రసాద్ తెలిపారు. మునిసిపల్ కార్యా లయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతల పెరుగుదలకు జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. మహిళలంతా చిన్న చిన్న మొక్కలతో రూఫ్ టాప్ గార్డెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, కొప్పోలు చిన్నపురెడ్డి, గ్రైడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వాగాల శ్రీహరి, పీఎంసీ ఇన్‌చార్జి అంబటి మాధవి, పలువురు మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత హోమాలు, చండీయాగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణాసంచా నడుమ గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

ఏఎస్‌పేట,మే17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పద్మజారెడ్డి తెలిపారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, మురికి కాలువలు పరిశుభ్రం, తదితర వాటిపై దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీ రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కొట్టే వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సాతువారిపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా గ్రామంలోని రహదారులు, తాగునీరు, స్మశాన వాటిక సమస్యలను శాసన సభ్యులు కాకర్ల సురేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చేస్తానని హామి ఇచ్చారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు పఠాన్ రసూల్, వైసీపీ పార్టీకి చెందిన సుమారు 80 కుటుంబీకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, కమతం శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, వీపూరి విష్ణు, రవి, వీర మహిళలు నాగవేణి, కాంతమ్మ, సంపూర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఎన్డీఏ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

దేశ రక్షణ దళాల కీర్తిని చాటడమే

తిరంగాయాత్రల లక్ష్యం

● నేడు ఆత్మకూరులో ర్యాలీ : ఆనం

ఆత్మకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : భారత రక్షణ దళాల పరాక్రమాన్ని కీర్తిస్తూ ఆత్మకూరులో ఆదివారం సాయంత్రం 4 గంటలకు భారీ జాతీయ జెండాతో నిర్వహించే తిరంగయాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ కూటమి నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉగ్రవాదులపై వీరోచితంగా పోరాడిన సైనికులకు యావత్ భారతదేశం అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ దేశమంతా తిరంగయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరులో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం నుంచి ర్యాలీని ప్రారంభించి సోమశిల రోడ్డు, బీఎస్ఆర్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్ మీదుగా సత్రం సెంటర్ వరకు అన్ని వర్గాల ప్రజలతో ర్యాలీ కొనసాగుతుందన్నారు. ప్రజలందరూ పెద్దఎత్తున తిరంగాయాత్ర ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసేలా ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూల వాయిదా

ఉదయగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు జరగాల్సిన ఇంటర్వ్యూ లు వాయిదా వేసినట్లు ఎంపీడీవో అప్పాజీ తెలి పారు. మరలా ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిం చేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఓబీఎంఎస్ సైట్ ఓపెన్ అయి ఉన్నందున అర్హులై ఉండి ఇంకా దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే మైనార్టీ రుణాల కోసం ఓబీఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

C.R.I.M.E N.E.W.S

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన ఆరుగురు నిందితులను సంతపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంతపేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ దశరథరామారావు వెల్లడించారు. సంగం మండలం మర్రిపాడుకు చెందిన శనగ వీరరాఘవయ్య పది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లారు. 14వ తేది తెల్లవారుజామున ఆయన రైలులో నెల్లూరుకు చేరుకున్నారు. రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా సింహపురి హోటల్ వద్ద గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లలో వచ్చి అతనిని అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.1000 దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులుగా ఓల్డ్ చెక్‌పోస్ట్ ప్రాంతానికి చెందిన షేక్ నవాజ్, నెల్లూరు రూరల్ ప్రాంతం నవలాకుల తోటకు చెందిన షేక్ షాహుల్, జాకీర్ హుసేన్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ కేరాఫ్ అబ్దుల్ అజీజ్, నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకు చెందిన భీమవరపు భాస్కర్, మరో ఇద్దరు బాల నేరస్తులను గుర్తించారు. వారిని శనివారం ఉదయం సింహపురి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి కత్తి, రూ.1000, రెండు మోటర్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : దానపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున వేదాయపాలెం-నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 35-40 ఏళ్ల మృతుడు స్కైబ్లూ వైట్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు, బిస్కెట్ కలర్ బెల్ట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న డ్రైవర్ రాజా

కావలి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం కావలి మండలం గౌరవరం సమీపం లోని జాతీయ రహదారిపై జరిగింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ చెన్నై నుంచి హైదరాబాద్‌కు కెమికల్ ప్యాకేజీ లోడుతో బయలు దేరింది. మార్గమధ్యం లోని గౌరవరం సమీపంలో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ రాజాను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

15 సవర్ల బంగారు నగలు చోరీ

● క్లూస్‌టీం పరిశీలన

చేజర్ల మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చేజర్లకు చెందిన ఖాదర్‌బాష తన ఇంట్లో ఉన్న 15 సవర్ల బంగారు నగలు చోరీకి గురైనట్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు శుక్రవారం తన కుమారుడిని నెల్లూరులోని ఆసుపత్రిలో ఆరోగ్యం చూపించేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని దుస్తులు, వస్తువులు కిందపడి ఉన్నాయని, బంగారు నగలు చూసుకోగా లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఇంట్లో తన తల్లి మాత్రమే ఉండగా, మధ్యాహ్నం సమయంలో ఆమె నమాజు కోసం కింద ఉన్న ఇంటిలోకి వెళ్లిందని, ఆ సమయంలో చోరీ జరిగి ఉంటుందని వాపోయాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్‌టీంతో పరిశీలించామని ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైం), మే 17(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. కర్నాటక రాష్ట్రం బీజాపూర్ గాంధీనగర్‌కు చెందిన హనుమంతుకు భార్య పిల్లలున్నారు. ఆయన పదేళ్లుగా చెన్నై పల్లవరం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికుడుగా పని చేస్తున్నారు. హనుమంతు వరుసకు తమ్ముడైన తిమ్మయ్యతో కలిసి పనిపై శుక్రవారం సాయంత్రం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో హనుమంతు అనారోగ్యానికి గురవ్వడంతో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఆత్మకూరు బస్టాండుకు చేరుకున్నారు. అక్కడి నుంచి చెన్నైకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో అక్కడికి వచ్చి అకారణంగా హనుమంతుతో గొడవపడ్డారు. బండరాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకునే లోపు వారు పరారయ్యారు. గాయపడిన హనుమంతును 108 సిబ్బంది చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమయంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు అందడంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులు వేదాయపాలెం ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

నూకనపల్లిలో ఇంటిపై పిడుగు పడి దెబ్బతిన్న పిట్ట గోడ



కలువాయి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. నూకనపల్లి గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడి పిట్టగోడ దెబ్బతింది. మిద్దె ఇంటి పిట్టగోడకు ఇనుప పైపు ఏర్పాటు చేసి దానికి విద్యుత్ టాప్ లైటు ఏర్పాటు చేశారు. పిడుగు టాప్‌లైటుపై పడటంతో పిట్టగోడ నిలువునా పగిలిపోయింది. కలువాయిలో కూడా భారీ శబ్ధంతో మెరుపులు రావడంతో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయినట్లు పలువురు తెలిపారు. ఇన్వటర్లు, ఫ్రిజ్‌లు, టీవీలు దెబ్బతిన్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు ధాన్యం అమ్మకుండా పొలాల్లో నిల్వ ఉంచారు. తడవకుండా పట్టలు కప్పినా కింది వైపు నుంచి లోపలికి నీరు వెళ్లి తడస్తుయని రైతులు ఆందోళన చెందారు.

చికెన్ ధరలు	
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 525	



కర్నాటక గవర్నర్‌నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కావ్య

కావలి వాసికి డాక్టరేట్

కావలి, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎంఎస్ నాయకుడు తొట్టెంపూడి ప్రసాదరావు కుమార్తె కావ్య శుక్రవారం కర్నాటక వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆరాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. బెంగళూరు వ్యవసాయవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన కావ్య జన్యు శాస్త్రం, మొక్కల పెంపకంపై చేసిన పరిశోధనలలో డాక్టరేట్ పొందారు. వ్యవసాయశాస్త్ర వేత్తగా రైతుల సంక్షేమానికి కృషి చేయటమే లక్ష్యం అని కావ్య తెలిపారు. ప్రస్తుతం బాపట్లలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టీచింగ్ అసోసియేట్‌గా పనిచేస్తున్నానని తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారి విగ్రహాన్ని తెస్తున్న భక్తులు

కావలిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ విగ్రహ పునఃప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చక బృందం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గుడి ఉత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవతా పూజ, బింబ శుద్ధి, హోమం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, వోలేటి నాగేశ్వరరావు, చీదెళ్ల రామచంద్రారావు, పోతుగంటి అలేఖ్య, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి, పీ సీవీసీ సత్యం, పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి పైపులైన్

● మంచినీరు వృథా



రోడ్డుపై పారుతున్న నీరు

లింగసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం ఆన కట్ట వద్ద ఉన్న చిల్లమొద్దులను శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా అంతర్గత మంచినీటి పైపులైన్‌కు ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి పగిపోయింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఈ నీరు పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి రోడ్డు దెబ్బతింటోంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కావలి : బీట్ ద హీట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, పోలీస్ అధికారులు



పోకూరు గ్రామ సచివాలయ ముందు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

గ్రామాల పరిశుభ్రతే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' లక్ష్యం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమని, ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. శనివారం జలదంకి మండలం కమ్మవారిపాలెంలో జరిగిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామసచివాలయంలో పంచాయతీ పాలకవర్గం, అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. గ్రామ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎపిడి, తహసీల్దారు ప్రమీ, ఎండిఓ బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు కరియావుల అప్పలయ్యానాయుడు, పచ్చా పెంచలయ్యనాయుడు, మలినేని హరిబాబు, జయచంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డిలు పాల్గొన్నారు.

● కావలి : స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కావలి పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో ఉష్ణోగ్రతలను తట్టుకునే విధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రంకు రోడ్డులోని సెల్ఫీపాయింట్ వద్ద ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లి ప్రయాణికులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందచేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో, రెండో పట్టణ సీఐలు ఫిరోజ్‌ఖాన్, గిరిబాబు, ఎస్‌ఐలు, మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, టీపీవో వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మవారిపాలెంలో మొక్కలు నాటుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

●లింగసముద్రం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ ఏపిఎం డా. కె సింహాద్రి, ఆర్‌ఐ ఎం రమణయ్య, తదితర అధికారులు, సిబ్బంది స్థానిక వెలుగు కార్యాలయం నుంచి లింగసముద్రం వరకు పొదుపు గ్రూపుల మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాలతి, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, ఈసీ విజయకుమార్, టీడీపీ నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సీసీలు మాధవ, మాధవరావు, నారాయణమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలపాడులో

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మాజీ సర్పంచు టీడీపీ నేత బత్తుల శ్రీనివాసులు, కె సుబ్బులునాయుడు, యల్లావుల మాధవ, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో టీడీపీ నేత కొండూరి అశోక్‌కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేసి, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎంఎం సుధాకర్, ఎఫ్ఏ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ సూచించారు. శనివారం మండలంలోని పోకూరు గ్రామ సచివాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత తమ శాఖ కార్యకర్తలతో కలిసి వలేటివారిపాలెం పంచాయతీలోని బండవారిపాలెంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●అల్లూరు : మండలంలోని పలు పంచాయతీలలో బీట్ ద హీట్ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో రజనీకాంత్ నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. చలివేంద్రాలు ప్రారంభించారు. అలాగే సచివాలయాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి వరప్రసాద్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●కొండాపురం : కొండాపురం మండలం ఆదిమూర్తిపురం, సాయిపేటలలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఆదిమూర్తిపురంలో ఎండిఓ ఆదినారాయణరావు, సాయిపేటలో గుడవల్లూరు సొసైటీ సిఈఓ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతీ నెలా మూడవ శనివారం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రెండో పంటకు నీరు విడుదల



ఎస్సీపీఎంకు నీరు విడుదల చేస్తున్న మధుబాబునాయుడు

బిట్రగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని ఎస్సీపీఎం మేజర్ కాలువ కింద ఉన్న రైతులకు రెండవ పంటకు కావలి ఉపకాలువ వద్ద నీటి సంఘం అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబునాయుడు శనివారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన రైతుబిడ్డ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధికారులతో మాట్లాడి రెండవ పంటకు నీరు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు సత్యప్రసాద్, శరత్ కుమార్, నీటిసంఘం అధ్యక్షుడు యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య, శ్రీహరి, మాజీ సర్పంచు రమేష్‌రెడ్డి, ఏఈలు నాగార్జున, మాధవరావు, గిరికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టెలు ప్రారంభం



పశువుల నీటితొట్టెలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో తదితరులు

కలిగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగిరి, వీరనకొల్లు, లక్ష్మీపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామి పథకం నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్టెలను శనివారం ఎమ్పీడీవో ప్రత్యూష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం: పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు పశువుల నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని పోకూరులో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ అండ : మాలేపాటి



అంజయ్యకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన టీడీపీ బీసీ నేత నాటకరాణి బాస్కర్ తండ్రి నాటకరాణి అంజయ్య (72) శుక్రవారం రాత్రి మృతి చెందగా శనివారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జక్కేపల్లిగూడూరు కమ్మవారిపాలెంకు చెందిన టీడీపీ నేత ముల్లంగి మధు తండ్రి వెంకటసుబ్బయ్య (70) శనివారం ఉదయం మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు కే రఘురాంనాయుడు, ముంతాల వెంకయ్య, ఎల్ సుధీర్ బాబు, ఐ రాంమోహన్‌రెడ్డి, పీ.సుబ్బారావు, ఎస్.శీనయ్య, శ్రీధర్ ఉన్నారు. బాధిత కుటుంబాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు.

ఉపాధి పనుల పరిశీలన



బొంతవారిపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని బొంతవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు తిరిగి రావాలని తెలిపారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీలకు మహర్దశ

కొండాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమయిన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పంచాయతీలకు ప్రభుత్వం జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోసిందని చెప్పవచ్చు. పంచాయతీలకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సంఘం నిధులు విడుదలచేయడంతో పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని సంతరించకోనున్నాయి. దీంతో మండలంలోని అన్ని పంచాయతీలలో అభివృద్ధి పరుగులు పెట్టించవచ్చని పాలకులు అంటున్నారు.

మండలానికి రూ. 4 కోట్ల కేటాయింపు

మండలంలోని 19 పంచాయతీలుండగా 2021వ సంవత్సరంలో పంచాయతీ పాలకుల ఎంపికకొరకు ఎన్నికలు జరిగాయి. కొలువుదీరిన సర్పంచులు అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు. నిధులలేమితో పంచాయతీలలో వీధి లైట్లు సైతం మార్చుకోలేని స్థితిలోకి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చారు. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధులలేమితో కొట్టు మిట్టాడాయి. గ్రామాలలో ప్రజలకు కనీసం తాగునీరు అందించలేని స్థితికి చేరాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీ కష్టాలనుచూసి అధికారంలోకి రాగానే పంచాయతీలకు మంచిరోజులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధులు విడుదలచేసిచేసి పంచాయతీలను ఆదుకుంటానని ఇచ్చిన హామీమేరకు కేంద్రం చొరవతో ఆర్థికసంఘం నిధులు విడుదలచేయించడం జరిగింది. జనాభా ప్రాతిపదికన మండలానికి రూ 4 కోట్లు విడుదలకానున్నాయి.

ఆర్థిక సంఘం నిధులతో మౌలిక వసతులు

మండలంలోని 19 పంచాయతీలలో 39 వేల జనాభా ఉన్నారు. 2 వేలకు పైగా జనాభా కలిగి 8 పంచాయతీలుండగా మిగిలిని 11 పంచాయతీలలో 2 వేలకులోపు జనాభా ఉన్నారు. జనాభా ప్రాతిపదికన ఒక్క వ్యక్తికి ఏడాదికి రూ 1000 చొప్పున ప్రభుత్వం విడుదలచేస్తుంది. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం సంవత్సరానికి రెండు విడతలుగా ఆయా పంచాయతీ ఖాతాలలో జమచేస్తుంది. ఈనిధులతో గ్రామాలలోని ప్రలజకు మౌళిక వసతులయిన తాగునీరు, పారిశుధ్యం, సీసీ రోడ్లు ఏర్పాటు, చెత్తనుండి సంపద తయారీకేంద్రాల నిర్వహణ, వీధిలైట్లు ఏర్పాటు తదితర పనులను చేసుకునేందుకు అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు విడుదలచేసిన నగదును బ్యాంకు ఖాతానుండి పక్కదారిపట్టించి పంచాయతీలను గాలికొదిలేశారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి : ఆదినారాయణరావు, ఎంపీడీవో

15 వ ఆర్థిక సంఘం నిధులను తొలివిడతగా ప్రభుత్వం విడుదలచేసింది. పంచాయతీల ఖాతాలకు త్వరలో జమ అవుతాయి. జమ అయిన నిధులను ఆయా గ్రామాలలో ప్రజలకు మౌళిక వసతులుకల్పించేందుకు వినియోగించాలి.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

● పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం నుండి చుండికి వెళ్లే నేషనల్‌హైవేకు అతి సమీపంలోని పొలాల్లో విద్యుత్ స్తంబాలకు పిచ్చి మొక్కలు, పిచ్చి తీగలు, తుప్పర్లు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. పిచ్చి మొక్కలకు కరెంట్ సరఫరా అయితే మనుషులకు, పశువులకు, సన్నజీవాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అంతేగాకుండా పొలాలకు వెళ్లే కూలీలు, రైతులు కూడ విద్యుత్ ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు

ఉగ్రవాదం అంతం అందరి లక్ష్యం కావాలి

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, వివిధ పార్టీల కార్యకర్తలు, పట్టణ ప్రజలు

కందుకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతంచేయటమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం ద్వారా భారత త్రివిధ దళాలు తమ శక్తిసామర్థ్యాలను మరోసారి ప్రపంచానికి చాటాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైన్యానికి మద్దతుగా శనివారం సాయంత్రం కందుకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్, అంబేద్కర్ విగ్రహం మీదుగా సబ్ కలెక్టరు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 120 అడుగుల భారీ జాతీయ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జాతీయ జెండాను చేతబట్టి ముందుకు సాగగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు జాతీయజెండాలు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై నినాదాలతో పట్టణం మార్మోగింది. సబ్ కలెక్టరు కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపౌరుడు భారతసైన్యానికి సంఘీభావంగా నిలవాలన్నారు. సైన్యానికి సంఘీభావం ప్రకటించటంతో పాటు యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు నివాళులు అర్పించటమే లక్ష్యంగా ఈ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరజవాన్ మురళీనాయక్‌కు అశ్రునివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాద్, జొన్నాదుల రాఘవులు, ఉన్నం బాస్కరరావు, మదన్, డాక్టరు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన పంట కాలువలు, అలుగులు



చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం పాత చెరువు

లింగసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 7 చిన్నతరహా సాగునీటి చెరువులైన లింగసముద్రం పాత, కొత్త చెరువులు, విశ్వనాధపురం, వీఆర్ కోట, చినపవని, మేదరమెట్లపాలెం, మొగిలిచెర్ల చెరువులతో పాటు 8 పంచాయతీరాజ్ చెరువులకు చెందిన తూములు, పంట కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. అంతేగాక పంట కాలువలు చిల్లచెట్లతో నిండి పూడికతో నిండిపోయాయి. చెరువులు కూడా చిల్లచెట్లతో నిండి కీకారణ్యాలను తలపిస్తున్నాయి. అలాగే ఈ చెరువులకు నీటిని అందించే ఒరవలు, వాగులు కూడా పలు చోట్ల చెట్లతో నిండడంతో పాటు కొన్ని చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. ఈ కారణాల వలన సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. లింగసముద్రం పాత చెరువులో కూడా చిల్లచెట్లు నిండి ఉన్నాయి. అలాగే పంట కాలువలు, తూములు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే చెరువు అలుగు కూడా పూడికతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉన్నాయి. అయితే మండలంలోని 7 సాగునీటి చెరువులు, 8 పంచాయతీరాజ్ చెరువుల అభివృద్ధికి మైనర్ ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం లింగసముద్రం కొత్త, పాత చెరువులు, వీఆర్ కోట, చినపవని సాగునీటి చెరువులకు, ఎర్రారెడ్డిపాలెం పీఆర్ చెరువు అభివృద్ధికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. కానీ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం రూ.10 లక్షలకు బదులు రూ.4 లక్షలు మాత్రమే మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వులు వచ్చాయని అధికారుల ద్వారా తెలిసింది. దీంతో ఈ నిధులతో ఏమి పనులు చేయాలో తెలియడం లేదని అధికారులు అంటున్నట్టు తెలిసింది. దీంతో రైతులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌తో కరిగిపోతున్న చుండి కొండ

● ఇష్టానుసారంగా తవ్వకాలు ● అనుమతులు లేకుండా కొండరాయి తరలింపు ● ప్రభుత్వ ఆదాయానికి గండి



అక్రమ బ్లాస్టింగ్‌తో రూపు కోల్పోయిన చుండి కొండ

వలేటివారిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి రెవెన్యూ గ్రామంలోని కొండను కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తూ యదేచ్ఛగా కొండరాయిని తరలిస్తుండడంతో రోజురోజుకు చుండికొండ కరిగిపోతోంది. అక్రమార్కులు ఏళ్ల తరబడి కొండను తొలిచేసి రాయిని గుట్టుచప్పుడు కాకుండా గృహనిర్మాణ లబ్ధిదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు కొండల్లో బ్లాస్టింగ్ చేసి పగలు రాయిని తొలిచి సైజులుగా చేసి అక్రమార్కులు విక్రయించుకుంటున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో కొండరాయిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమార్కులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, ప్రభుత్వానికి పైసా రాయిల్టీ చెల్లించకుండానే విక్రయంచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అంతేగాక పచ్చదనంతో అలరారే కొండ కళను కోల్పోతోంది. పశువులు, మేకలు, గొర్రెలకు మేత దొరికే కొండ కరిగిపోతుండడంతో పశు పోషకులు గొర్రెలు, మేకల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కొండరాయి తవ్వకాలను అడ్డుకొని ప్రకృతి వనరులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనుమతులు లేవు : తహసీల్దార్


చుండి కొండలోని కొండరాయి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చిన దృశ్యం

రాకెట్: పీఎస్ఎల్వీ-సీ 61
ఎత్తు: 44.5 మీటర్లు
బరువు: 321 టన్నులు

ఉపగ్రహం: ఈవోఎస్-09 (రీశాట్-1బీ)
బరువు: 1.696.24 కిలోలు
ప్రయోజనం: దేశ రక్షణ, సైనిక అవసరాలు



ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్

నేడే 101వ రాకెట్ ప్రయోగం

● పీఎస్ఎల్వీ శిఖర భాగంలో సిద్ధంగా రీశాట్-1బీ ఉపగ్రహం

సూళ్లూరుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగ సన్నాహాలు శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో పూర్తయ్యాయి.శాస్త్రవేత్తలతో షార్ సందడిగా మారింది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. అంతకుమునుపు పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి ప్రయోగ వేదిక వద్దకు తరలించి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని అనుసంధానం చేశారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం వరకు 22 గంటలపాటు కొనసాగనుంది.కౌంట్‌డౌన్ సమయంలోనే రాకెట్‌లోని రెండవ, నాల్గవ దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమై వున్నారు. ప్రయోగ నేపథ్యంలో షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సముద్ర మార్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 63వ ప్రయోగం కాగా షార్ నుంచి 101 ప్రయోగం కావడం విశేషం. 18 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని రాకెట్ చేరవేస్తుంది.


నాలుగు దశల్లో ..

139 టన్నుల ఘన ఇంధనం గల మొదటి దశ భూమికి 69 కి.మీ ఎత్తులోకి 111.64 సెకన్లకు పూర్తవుతుంది. 41 టన్నుల ద్రవ ఇంధనం గల రెండవ దశ 264.34 సెకన్లకు 231 కి.మీ ఎత్తులోకి ఉపగ్రహాన్ని తీసుకువెళ్తుంది. మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. 493 సెకన్లకు 443 కి.మీ ఎత్తులోకి శిఖరభాగాన్ని చేరుస్తుంది. 2.5 టన్నుల ద్రవ ఇంధనం గల నాలుగో దశ 503.40 సెకన్లకు ప్రారంభమై 1012.24 సెకన్లకు 533 కి.మీ ఎత్తులోకి చేరుతుంది. 1059.24 సెకన్లకు 530 కి.మీ ఎత్తులో నిర్ణీత కక్ష్యలోకి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని చేరవేస్తుంది. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన వెంటనే భూకేంద్రాలకు సంకేతాలు అందుతాయి.



షార్ మొదటి గేటు వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు

● నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం





తగునా ఇది టీటీడీకి?

|| పురాతన సంపదపై నిర్లక్ష్యం ||

మూతబడ్డ తిరుమల, తిరుపతి మ్యూజియాలు

సనాతన సంప్రదాయానికీ, భారతీయ సాంస్కృతిక సంపదకూ సాక్ష్యమైన మ్యూజియంకు దిక్కులేకుండా పోయింది. తిరుమలలో అత్యంత సుందరమైన భవనంలో నెలకొల్పిన మ్యూజియంను ఆధునికీకరణ పేరుతో మూసేసి ఐదేళ్లు అయిపోగా, తిరుపతిలోని మ్యూజియంకు మంగళం పాడి రెండేళ్లు దాటింది. జగన్ ప్రభుత్వంలో చాపచుట్టేసిన అనేకానేకాల్లో ఈ హిందూ ఔన్నత్య సంపద కూడా ఒకటి. దాతలకు కొదవ లేదు. నిధులకు కొరత లేదు. లోపించిందల్లా చిత్తశుద్ధి మాత్రమే. టీటీడీ లాంటి ప్రపంచ ప్రసిద్ధ హిందూ ధార్మిక సంస్థ నిర్వహించే మ్యూజియంలు సమర్థంగా నడపలేకపోవడమే విచిత్రం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

45 ఏళ్ల కిందట ప్రారంభమైన తిరుమల మ్యూజియం

తిరుమలలో 1980లో శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో ఆర్ష సంస్కృతి సదస్సు పక్కన టీటీడీ మ్యూజియం ఏర్పాటు చేసింది. దీనిని 1996లో వైకుంఠం క్యూకాంప్లెక్స్1 ఎదురుగా 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని అందమైన భవనాల్లోకి తరలించారు.'శ్రీవేంకటేశ్వర మ్యూజియం' పేరుతో రూ.3.5కోట్లతో అప్పట్లో నిర్మించారు.

కొరవడిన సమర్థుల సారథ్యం

జగన్ ప్రభుత్వంలోని అధికారులుగానీ, పాలక మండలిగానీ మ్యూజియం మీద తగినంత శ్రద్ధ పెట్టలేదు. పనులు చేసేందుకు పెద్ద సంస్థలు ముందుకు వచ్చినా పర్యవేక్షణ, సమన్వయం కొరవడింది. సమర్థులైన అధికారులను నియమించలేదు. రాజకీయ నియామకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. భారతీయ సంస్కృతి పట్ల అవగాహన ఉన్న ఒక అధికారికి బాధ్యతలు అప్పగించి కూడా అతను అప్పటి అధికార పార్టీ నాయకుల సామాజిక వర్గం కాదనే కారణంతో ఆఖరి క్షణంలో మార్చేశారు. కోరుకున్న అధికారిని నియమించినా పనులు వేగంగా సాగేందుకు అధికారులు సహకరించలేదు. ఆ తర్వాత ఇద్దరు అధికారులను ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించారు. మ్యూజియంపై వీరికి తగిన అవగాహన లేదనే విమర్శలు ఉన్నాయి.పనులు ముందుకు కదలకపోవడంపై టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఒక మ్యూజియం అభివృద్ధికి ఏకంగా రూ.125 కోట్లు వెచ్చించడం చాలా పెద్ద నిర్ణయం. ఈ నిధులతో మ్యూజియంలో చేయాల్సినవేమిటో నిపుణుల సలహాలతో తగిన ప్రణాళిక రూపొందించుకుని ఇప్పటికే పూర్తి చేసి వుండవచ్చు. అయితే నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మ్యూజియంలోని విలువైన పురాతన సంపద మూలన పడివుంది. ఇక విలువైన కొన్ని వస్తువులను హైదరాబాద్‌కు చెందిన సలార్‌జంగ్ మ్యూజియం నిపుణుల బృందం సంరక్షిస్తోంది.

మ్యూజియంలో ఏమున్నాయంటే..

తిరుమల సంప్రదాయాలు, వైష్ణవ మతం, హిందూ సంస్కృతికి ప్రతీకగా ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచాలు, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ.. ఇలా ఆసక్తికరమైనవి ఎన్నో ఈ మ్యూజియంలో ఉన్నాయి. తిరుమలకు సంబంధించిన అద్భుతమైన ఫొటోలు ఉన్నాయి. బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంత రాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తొడరమళ్ల, అచ్యుత దేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల విగ్రహాల ఫొటోలు ఉన్నాయి. కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయం ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దంనాటి అలిపిరి చెక్క మండపం, శ్రీకృష్ణ లీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వార పాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు.. ఇలా లెక్కకు మిక్కిలి ఉన్నాయి.తిరుమల ఆలయం 1,500ఏళ్ల చరిత్రను తెలిపేలా వెయ్యికిపైగా శాసనాలు,రాగిరేకులు ఉన్నాయి. 6వేలకుపైగా వస్తువులను ఎస్వీ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు.

రూ.125 కోట్ల వితరణతో టాటా సంస్థ

ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించింది. సహకరించేందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ పనుల కోసమని 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో 3డీ, 7డీ, హంగులతో 19 గ్యాలరీలతో ఎస్వీ మ్యూజియాన్ని అత్యాధునికంగా మార్చి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ భావించింది. ఈ పనులన్నీ ఏడాదిలో పూర్తవుతాయని ప్రకటించింది. అయితే ఐదేళ్లయినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.





2023లో మూతపడిన తిరుపతి మ్యూజియం

ఇక తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి సమీపంలో ఎస్వీ మ్యూజియంను 1983లో ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం, శిల్ప శాస్త్రం, ఆగమ పద్ధతులు, శాస్త్రీయ నిర్మాణ రూపాలు, శ్రీవారి వాహనాలు, 108 దివ్యక్షేత్రాలు, సంగీత వాయిద్యాలు, కలంకారీ కళాచిత్రాలు ఇందులో ఉన్నాయి. అత్యంత విలువైన అన్నమయ్య కీర్తనల రాగిరేకులు కూడా ఈ మ్యూజియంలో ఉండేవి. మ్యూజియం ఏర్పాటు చేసిన పురాతన మండపంలో లీకేజీలు ఏర్పాడ్డాయి. దీంతో దీనిని కూడా 2023లో మూసివేశారు. ముఖ్యమైన వస్తువులను తిరుమలకు తరలించారు. ఇప్పుడు వాటి పరిస్థితి ఏమిటో అధికారులే చెప్పాల్సి ఉంది.

ఒక్కో పోస్టుకు 34మంది పోటీ

● డీఎస్సీకి అందిన దరఖాస్తులు 45,221
● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 26,501మంది అభ్యర్థుల పోటీ

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి పోటీ ఎక్కువగానే వుంది.గత నెల 20వ తేదీన మొదలైన డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15వ తేదికి ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 45,221దరఖాస్తులు అందాయి.వచ్చిన దరఖాస్తుల్లో పురుషుల కంటే అధికంగా 6195మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. జిల్లాలోని 1478 పోస్టులను రెండు విభాగాలుగా చేస్తూ దరఖాస్తులు స్వీకరించారు.జనరల్ కేటగిరిలో 1324 పోస్టులు, దివ్యాంగుల కేటగిరిలో 149 పోస్టులు కేటాయించారు. జనరల్ క్యాటగిరిలో ఒక్కో అభ్యర్థి ఒక్క పోస్టుకు మించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే 26,501మంది అభ్యర్థులు ఏకంగా 45,221 దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఒక్కో పోస్టుకు 34 మంది పోటీ పడనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 10,153మంది పురుషులు, 16,348 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. దివ్యాంగుల కేటగిరిలో మరో 149 పోస్టులకు గాను 2461 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 16మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనుండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు కేటగిరీలు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ 1473 పోస్టులు భర్తీ చేయనుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు(మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2)తో మొత్తంగా 1478 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి.

పోస్టు	జడ్పీ ప్రభుత్వ మున్సిపాలిటీ
ఎస్జీటీ	976
ఎస్ఏ తెలుగు	38
ఎస్ఏ హిందీ	17
ఎస్ఏ ఇంగ్లీష్	104
ఎస్ఏ మ్యాథ్స్	30
ఎస్ఏ ఫిజిక్స్	29
ఎస్ఏ బయాలజి	63
ఎస్ఏ సోషల్	130
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు	05
మొత్తం	1478

దివ్యాంగుల కేటగిరిలో 149 పోస్టులకు 2461 దరఖాస్తులు

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఈడబ్ల్యుఎస్	138	1664
పీహెచ్-విజువల్	1	134
పీహెచ్-హియర్	10	57
ఆర్థోపెడికల్	-	595
మెంటలీ ఇల్‌నెస్	-	11
	149	2461

● ఏపీ డీఎస్సీ ఉమ్మడి చిత్తూరు జిల్లా రోస్టర్ పోస్టులు, వచ్చిన దరఖాస్తులు

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఓసీ	578	2856
బీసీ-ఏ	111	4000
బీసీ-బీ	139	3790
బీసీ-సీ	19	101
బీసీ-డీ	102	2570
బీసీ-ఈ	53	1661
ఎస్సీ-గ్రేడ్ 1	21	4
ఎస్సీ-గ్రేడ్ 2	94	1872
ఎస్సీ-గ్రేడ్ 3	112	7997
ఎస్టీ	95	1650
	1324	26.501

మే 20 నుంచి మాక్ టెస్టు : మెగా డీఎస్సీ ప్రక్రియలో భాగంగా తొలి దశ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన వేళ, మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30 నుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్ మెమో)విడుదల చేయనున్నారు.

సామాజిక బాధ్యతగా స్వచ్ఛాంధ్ర

● నాయుడుపేటలో మొక్కలు నాటిన కలెక్టర్ వెంకటేశ్వర్


నాయుడుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రను ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన నాయుడుపేట గోమతి సెంటర్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాతో కలసి మొక్కలు నాటారు. గాంధీ మందిరం పార్కు వద్ద పక్షులకు చిరుధాన్యాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలను దూరం చేయవచ్చునన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో పరిసరాల శుభ్రతకు, పొడిచెత్త, తడిచెత్త సేకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ పాల్గొన్నారు.



గాంధీ మందిరం పార్కులో పక్షులకు చిరుధాన్యాలు ఏర్పాటు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దీపిక, మాజీ ఎంపీ నెలవల

స్కేటింగ్‌పై ఆసక్తి. సాధన చేద్దామంటే ట్రాక్ లేదు. అయితేనేం పట్టుదలతో కసరత్తు చేసింది. రోడ్డే ట్రాక్‌గా చేసుకుంది. గాయాల పాలైనా వెనుకంజ వేయలేదు. ఇటీవల జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కస్సరాజు స్నేహకృతి క్రీడా నేపథ్యమిది.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నటి హరితేజ, సీఎం చంద్రబాబు సోదరి హైమావతమ్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.56 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,970
తలనీలాలు సమర్పించినవారు: 33,871





సాధించిన పతకాలతో స్నేహకృతి

కాళ్లకు చక్రాలు కట్టుకుని...!

● జాతీయ స్థాయి స్కేటింగ్‌లో బంగారు పతక విజేత స్నేహ కృతి

ఇంటిల్లిపాదీ క్రీడలు ఆడే కుటుంబం నుంచి వచ్చింది కస్సరాజు స్నేహ కృతి. ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్ల పోటీల్లో బంగారు పతకంతో మెరిసింది. తిరుపతి రూరల్ పేరూరు సమీపాన నివాసం. తల్లి ప్రొఫెసర్ అఖిల స్వతంత్ర ఎస్వీ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి. తండ్రి వంశీకృష్ణ న్యాయవాది. అక్క ఆశ్రిత తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లేవారు. అక్కతో పాటు స్నేహకృతి కూడా వెళుతూ స్కేటింగ్ పట్ల మక్కువ పెంచుకుంది. తల్లికి షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్‌లో ప్రావీణ్యముంది. తండ్రి వంశీకృష్ణ కబడ్డీలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్కేటింగ్ ట్రాక్ లేకున్నా రోజూ ప్రకాశం పార్క్‌కు వెళ్లి రెండు పూటలా ప్రాక్టీస్ చేసేది. ఒక్కోసారి ఐదు గంటల వరకూ ప్రాక్టీస్ చేసిన సందర్భాలున్నాయి. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి బాబ్జీ, కోచ్‌లు ప్రసాద్, శశి కిరణ్, పవన్ కల్యాణ్ వద్ద మెలకువలు నేర్చుకుంది. పదేళ్ల నిరంతర కఠోర సాధన ఫలితమే తాజాగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకమంటోంది స్నేహకృతి. కాకినాడ స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్లు, వెయ్యి మీటర్ల పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. 2019లో జాతీయ స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను పొందింది. స్నేహకృతి తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థల్లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇంటర్‌లో 470కి గాను 456 మార్కులు సాధించింది. పదవ తరగతిలో 600కు 587 మార్కులు పొందింది.



తల్లిదండ్రులతో స్నేహకృతి

ట్రాక్ ఏర్పాటు చేయాలి

తిరుపతిలో కనీసం 200 మీటర్లతో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఎందరో రాణిస్తారు. నేను రోడ్లపైనే ప్రాక్టీస్ చేస్తూ అనేక సార్లు గాయపడ్డాను. అనుకూల వాతావరణం కల్పిస్తే ఎక్కువ మంది ఎదుగుతారు. 2019లో జాతీయ స్థాయిలో రాణించిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతి ప్రకటించినా అందలేదు. జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్‌కు రూ.75 వేలు, రజిత పతకానికి రూ.50 వేలు ప్రకటించి ఇవ్వలేదు. ఇలాంటివి అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- స్నేహ కృతి

శ్రుతిమించిన ఇసుకాసురుల ఆగడాలు

● పొర్లుకట్టను సైతం తొలిచేసిన వైనం

● ఆ మట్టితోనే నది గర్భంలోకి రోడ్డు ఏర్పాటు

పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా కప్పగుంట కండ్రిగ వద్ద పొర్లుకట్టను సైతం తవ్వేశారు. ఆ మట్టితోనే ఇసుక తరలింపు కోసం నది గర్భంలోకి ప్రత్యేక రోడ్డును నిర్మించారు. రోజూ రాత్రి ట్రాక్టర్లతో మేనకూరులోని ప్రైవేట్ కంపెనీలకు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు. వాహనాల రాకపోకలతో స్వర్ణముఖి నది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి.

● ఆందోళనలో రైతాంగం

స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వేస్తుండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది వాహనాలతో ఇసుకను తరలించేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక మాఫియాను కట్టడి చేయాలి

జీలపాటూరు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖినది సమీపంలో కప్పగుంటకండ్రిగ కాజ్‌వే నుంచి గత వైసీపీ హయాంలో భారీ యంత్రాలతో విచ్చలవిడిగా ఇసుక తోడేశారు. అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేసి ఇసుక తరలింపును అడ్డుకున్నాం. భూగర్భ జలాలను పెంచుతూ అదే ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మాంచాలని 2014 టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపాం. ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మిస్తే అనేక గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. అయితే ఇసుక మాఫియా అరాచకాలతో స్వర్ణముఖికి గర్భశోకం తప్పేలాలేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శివకుమార్, సర్పంచు, జీలపాటూరు



కప్పగుంటకండ్రిగ సమీపంలో పొర్లుకట్టను తొలిచిన అక్రమార్కులు - (ఇన్‌సెట్‌లో) నదిలో ఏర్పాటు చేసిన రోడ్డు

కవి గొల్లాపిన్ని కన్నుమూత



సుబ్రమణ్యశర్మ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): కవి గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మ (79) కన్నుమూశారు. చిత్తూరు జిల్లా నదుం ఈయన స్వగ్రామం. తిరుపతిలోని కొర్లగుంటలో నివాసముంటోన్న ఈయన శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. కవితాసుమాలు, పువ్వులు నవ్వులు, బాలలతాత, పక్షులం, విజయానికి ముప్పై రహస్యాలు, కల్హాపూర్ మహాలక్ష్మి చరిత్ర వంటి పుస్తకాలు వెలువరించారు. తిరుపతిలో జరిగే కవి సమ్మేళనాల్లో స్వీయ కవితలను లయాత్మకంగా చదివేవారు. గొల్లాపిన్నికి భార్య ఉషాకిరణ్, కుమార్తె సౌజన్య (అమెరికా), తనయుడు కిషోర్‌కుమార్ (బెంగళూరు) లో ఉన్నారు. సుబ్రమణ్యశర్మ అంత్యక్రియలు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన అత్తగారి ఊరైన అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కవి గొల్లాపిన్ని మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, సాహిత్యవేత్తలు ఆముదాల మురళి, శైలకుమార్, కృష్ణవేణి, యువశ్రీ మురళి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, సింగార బాలమురళీకృష్ణ సంతాపం తెలిపారు. గొల్లాపిన్ని మృతి జిల్లా సాహిత్య రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.

ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రణాళికలు: ఈవో



తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవదాయ శాఖ సహకారంతో నిర్మిస్తున్న ఆలయాల తీరుతెన్నులపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శనివారం అధికారులతో ఈ ఆలయాలపై సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిబంధనలను పునఃసమీక్షించుకుని మరింత మెరుగ్గా, సులభతరంగా, పారదర్శకంగా ఉండేలా తయారు చేయాలన్నారు. సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివన్నారు. ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మిక, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల నిర్వహణకు పక్కాగా ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీఈ టీవీ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వీడిన యువకుడి మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య మిస్టరీ వీడింది. ముక్కంటి ఆలయ సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి గుడి మార్గంలో ఉన్న శ్మశానంలో ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి ఈనెల 16న 'ఏం జరుగుతోంది' అన్న శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ హర్షవర్ధనరాజు కేసును త్వరితగతిన ఛేదించాలని శ్రీకాళహస్తి పోలీసు అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి సిబ్బందితో కలిసి ముక్కంటి ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. మృతుడిది పాండిచ్చేరిగా గుర్తించారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టకు చెందిన కొందరు యువకులు అతన్ని హతమార్చినట్లు ఆధారాలతో సహా నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, అధికారులు

తిరుపతి(ఆటోనగర్) మే17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేశారు. తిరుమల పర్యటన నిమిత్తం కేంద్రమంత్రి శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్‌కు హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో చేరుకున్నారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, బీజేపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ నాయకులు సామంచి శ్రీనావాసులు, గుండాల గోపినాథ్‌రెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖరరెడ్డి, రెడ్డిబాబు, ఎం.రవిప్రసాద్, డాక్టర్ నరేష్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో దేవెగౌడ



తిరుమల, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం రాత్రి మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నైవేద్య విరామ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. స్టేట్ లెవల్ కాన్సులేటివ్ కమిటీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్ కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో శ్రీకృష్ణ అతిథిగృహంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఏపీ అభివృద్ధికి సహకారం అందించాలని ప్రహ్లాద్‌జోషిని కోరారు. కాగా తొలుత కేంద్రమంత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకన్నారు. ఆయనతోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ కూడా ఉన్నారు.

కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం 6 నుంచి 7 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం జరగనుంది. వసంతోత్సవాలు సందర్భంగా ఆలయంలో ఆర్జిత, కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

అతిథిగృహాల ఆచూకీకి అగచాట్లు



పాండవ గెస్ట్‌హౌస్ అని ముద్రించిన రసీదు

● రసీదుల్లో కొనసాగుతున్న పాతపేర్లు

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అతిథిగృహాల ఆచూకీ గుర్తించేందుకు భక్తులు అగచాట్లు పడుతున్నారు. ఇటీవల అతిథిగృహాలపై పేర్లు మార్చినా గదుల కేటాయింపు రసీదుల్లో పాతపేర్లనే ప్రింట్ చేసి ఇస్తుండటంతో తికమక పడుతున్నారు. అతిథిగృహాలకు దాతల సొంత పేర్లు కాకుండా పవిత్ర ఆధ్యాత్మిక పేర్లు మాత్రమే ఉండాలని ఇటీవల ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ క్రమంలో 45 అతిథిగృహాలకు పేర్లు మార్చాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఇప్పటికే కొన్నింటి పేర్లను మార్చారు. కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. సిఫార్సు లేఖలను పద్మావతి విచారణ కార్యాలయంలో పరిశీలించి గదులను కేటాయిస్తారు. అయితే గదుల వివరాలతో ఇచ్చే రసీదులో పాతపేర్లే ఉంటున్నాయి. తీరా అక్కడకు వెళితే కొత్త పేరుతో ఉన్న బోర్డులను చూసి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తిరిగి పద్మావతీ విచారణ కార్యాలయానికి రావడం లేదా సమీపంలో ఉండే వ్యక్తులను గెస్ట్‌హౌస్ వివరాలను చెప్పి అడగడం వంటివి చేస్తున్నారు. గెస్ట్‌హౌస్‌లపై పేర్లు మార్చిన అధికారులు రసీదుల్లో మార్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పాండవ గెస్ట్‌హౌస్‌పై 'విరజా నిలయం' బోర్డు

శేషాచలంలో అనధికార ట్రెక్కింగ్ నేరం

● ఫారెస్టు రేంజర్ వెంకటరమణ



భాకరాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో అనుమతి లేకుండా ట్రెక్కింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఫారెస్టు రేంజర్ వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భాకరాపేట రేంజ్ అటవీ ప్రాంతంలో వెంకటేశ్వర అభయారణ్యం, వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం చేర్చారన్నారు. వన మూలికలకు, పక్షి, వృక్ష జాతులకు, ప్రకృతి సహజ సౌందర్యానికి ఈ ప్రాంతం కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడి విశేషాలను సోషల్ మీడియాలో పెడుతూ ప్రకృతి ప్రేమికులను మోసం చేస్తూ కొందరు నగదు వసూలు చేస్తున్నారన్నారు. ఇది చట్టవిరుద్ధమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు. ట్రెక్కింగ్ చేయడం శిక్షార్హమన్నారు. ఇప్పటికే తొమ్మిది ట్రెక్కింగ్ సంస్థలను గుర్తించి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో విచారిస్తున్నారన్నారు. అనధికారికంగా ట్రెక్కింగ్ చేసి ఫొటోలు, వీడియోలు పెట్టిన మహేశ్ బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశాన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. 8.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తిరుపతి కో-ఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలలోపలే పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలను అనుమతించేది లేదని తెలిపారు.

● పరీక్ష అనంతరం షెడ్యూల్ ఇలా.. : అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను ఈ నెల 22న వెబ్‌సైట్‌లో ఉంచుతారు. 26న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు తుది కీ, ఫలితాలు విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతంది.

నేడు సైన్స్ సెంటర్‌లో ఉచిత ప్రవేశం

మంగళం, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి సైన్స్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 3డీ షో, డిజిటల్ ప్లానిటోరియం షో, పార్కింగ్‌కు ఫీజు యథావిధిగా ఉంటుందని వివరించారు. మ్యూజియం, విజ్ఞానాన్ని పెంపొందించే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

1100కు కాల్ చేసి అర్జీ స్థితి తెలుసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందజేసిన అర్జీ స్థితి తెలుసుకోవడానికి అర్జీదారులు 1100టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే అదే నంబర్‌కు ఫోన్‌చేసి అప్లికేషన్ లేదా ఆధార్ లేదా మొబైల్ నంబర్లతో అర్జీ స్థితిని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 11,196 మంది దరఖాస్తు చేసుకోగా 10,356 మంది పరీక్షలు రాశారు. 840 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,473 మంది దరఖాస్తు చేసుకోగా 1,380 మంది పరీక్షలు రాశారు. 93 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

తుడా కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను తుడా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యేలు, నూతన చైర్మన్, వీసీల సమన్వయంతో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



రథోత్సవంలో అశేష జనవాహిని

వైభవంగా కరిమాణిక్యస్వామి రథోత్సవం
గోవిందనామ స్మరణతో మార్మోగిన తుమ్మూరు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి

నాయుడుపేట టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం టీటీడీ వేద పండితులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, శ్రీవారిని విశేషంగా అలంకరించి రథంపై అధిష్టింపజేశారు. అనంతరం అశేష జనవాహిని మధ్య రథోత్సవం ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్లపై భక్తులు మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మూరు గోవిందనామస్మరణలతో మార్మోగింది. రథోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఆంజనేయరాజు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ మహేష్, ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరీ, గ్రామస్తులు పసల గంగాప్రసాద్, మోహన్‌రెడ్డి, మురళి, నాగయ్య, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవిస్వామి, గోపీ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా హీట్ ది బీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పెంపుడు జంతువులకు ఆహారం, నీరు అందిస్తూ వాటికి రక్షణ కల్పించాలన్నారు. వేసవిలో ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక సీవీసీ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం,పేటేటి చంద్రనీల్, పెంచలయ్య, నయూం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

భారత జవాన్ల త్యాగాలు అమూల్యం



తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు, నాయకులు

వెంకటగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): భారత జవాన్ల త్యాగాలు అమూల్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆపరేషన్ సింధూ విజయవంతం అయిన నేపథ్యంలో శనివారం వెంకటగిరిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కాశీపేట కూడలి నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే అంటూ చేసిన నినాదాలు చేశారు. కూటమి నేతలతో పాటు పట్టణ ప్రజలు 9వ బెటాలిన్, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనడంతో పట్టణంలోని ప్రధాన రోడ్డు కిక్కిరిసిపోయింది.

శ్మశానం ఆక్రమణదారుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
పోలీసుస్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట యానాది సంఘం నాయకులు, గిరిజనుల ఆందోళన

బాలాయపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి) మండలంలోని మన్నూరు గ్రామంలోని గిరిజనుల శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన జడపల్లి రమణయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లిఖార్జున ఆధ్వర్యంలో బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భగా అయన మాట్లాడుతూ ఎనభై ఏళ్లుగా గిరిజనులు శ్మశానంగా వినియోగిస్తున్న భూమిని ఆక్రమించుకోవడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించిన గిరిజనులపై దౌర్జన్యానికి పాల్పడిన రమణయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎస్ఐ గోపీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘం సభ్యులు వెలుగోటి రేవతి, తిరుపతి రాములమ్మ, పనబాకుల కల్పన, మానికల చిరంజీవి, లక్ష్మయ్య, పెంచలమ్మ, చిన్న అంకయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

గూడూరు అర్బన్, 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం యాచకుడు మృతి చెందాడు. ఎస్ఐ గోపాల్ తెలిపిన మేరకు వివరాలు... కొంతకాలంగా రైల్వేస్టేషన్ సమీపంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తి శనివారం మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.మృతుడికుడి చేతిపై జయలక్ష్మి అని పచ్చబొట్టు ఉందని, పసుపురంగు చొక్కా, కాషాయపు రంగు పంచె ధరించి ఉన్నాడని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

20న జాబ్‌మేళా

గూడూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 20వ తేదీన డీఆర్‌డబ్ల్యూ, లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హనుమంతరావు కోరారు. శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న డీఆర్‌డబ్ల్యూ కళాశాల, లక్ష్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రముఖ పరిశ్రమల ద్వారా నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యా అర్హత కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, శ్రీనివాస్, లక్ష్య ఫౌండేషన్ ప్రతినిధి భానుచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసులు



బాలాయపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి ఎంపీడీవోగా కె.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఏవో వినీల్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

హామీలతో సరి!

- దశాబ్దాల కల చెంబేడు మినీ రిజర్వాయర్
- ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితం
- పద్దెనిమిది గ్రామాల రైతుల్లో ఆవేదన



పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు చెరువులో మినీ రిజర్వాయర్ ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది. ప్రతి ఎన్నికల సమయంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చుతామని నేతలు హామీలు ఇస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా... 30 ఏళ్లుగా హామీ మాత్రం నెరవేరడంలేదని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న 67 ఇరిగేషన్ చెరువుల్లో అతి పెద్దదైన చెంబేడు చెరువు 833 ఎకరాల్లో విస్తరించి ఉంది. 1962లో దివంగత ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖినదిలో చెక్‌డ్యాం ఏర్పాటు చేసి, అక్కడ నుంచి కాలువలు తవ్వించి చెంబేడు చెరువుకు సాగునీరందించారు. తదనంతరం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 7వ బ్రాంచి కాలువ తవ్వించి మండలంలోని అనేక చెరువులతో పాటు చెంబేడు చెరువుకు తెలుగుగంగ జలాలను అందించారు. దీంతో సుమారు 15 గ్రామాల్లోని 4 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రస్తుతం సాగునీరు అందిస్తోంది. చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చితే చెన్నప్పనాయుడుపేట, అర్ధమాల, ఆర్లపాడు, నందిమాల, బంగారంపేట, మోదుగులపాలెం, శిరసనంబేడు, పెరుప్పాడు తదితర గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు పుష్కలంగా అందుతుంది. 2016లో ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసిన జగన్ చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హామీలు ఇస్తున్నారే తప్పా కార్యరూపం దాల్చడం లేదు. గతంలో నీటిపారుదలశాఖ అధికారులు రూ. 32కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దానికి ఇప్పటి వరకు మోక్షం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుతో పాటు సాగునీరు అందించే కాలువలు, గేట్లు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఈ చెరువులో పూడిక చేరి, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ మండల కమిటీల నియామకంపై అభిప్రాయాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన పరిశీలికుడు కొండలరావు, నాయకులు శంకరయ్య, మురళీరెడ్డి, పెరుమాల్ తదితరులు

సూళ్లూరుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ మండల కమిటీల నియామకానికి శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పార్టీ పరిశీలికుడు కొండలరావు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు కమిటీ నియామ కానికి గ్రామస్థాయి నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మూడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే, పరిశీలికుడి ఎదుట తమ అభిప్రాయాలు వెల్లడిం చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మండల అధ్యక్ష, కార్యదర్శి పోస్టులకు అధిక పోటీ నెలకొనడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఐవీఆర్ కాల్స్ ద్వారా అభిప్రాయాన్ని సేకరించనున్నారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కామిరెడ్డి మురళి రెడ్డి, బొమ్మన పళణి, గాడి నారాయణ రెడ్డి, చిట్టేటి పెరుమాల్, కొక్కు శంకరయ్య, పాకం వెంకట సుబ్బయ్య తదతరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం: పాశిం

గూడూరు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇంటి స్థలం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మూడు సెంట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దారు చంద్రశేఖర్, నాయకులు శీలం కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొండుగుంట అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

కోట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగుంట అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... కొండుగుంట అటవీ ప్రాంతంలోని రావి చెట్టు కింద పూర్తిగా మాడిపోయినట్లు ఉన్న మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి వీఆర్వోకు తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

తడ, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇచ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కొలవి రఘురెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడ బజారుకూడలిలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎంఈవో మల్లికార్జున, సర్పంచులు ఆర్మూగం, జయప్రద, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్‌నెట్

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ కూడళ్లలో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఇంటింటికీ కెళ్లి వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో పోలిశెట్టిగుంట అభివృద్ధి

వెంకటగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిశెట్టిగుంటను రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని పోలిశెట్టిగుంట అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అంతకుముందు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటీశ్వరరావు

వెంకటగిరిటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కలపాడు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సందప తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో కోటీశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు

కోట, మే 17 (ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు కోట పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఈ నెల 19నుంచి 28వ తేదీ వరకు కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి.

రూ.రెండు లక్షల అల్యూమినియం చోరీ
ముగ్గురిపై కేసు

నాయుడుపేట టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో రూ.2 లక్షలు విలువచేసే అల్యూమినియం చోరీ జరిగినట్లు ఆ కంపెనీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మండలంలోని అరవపెరిమిడి గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కల్వర్టును బాగు చేయండి



కల్వర్టు వద్ద నిలిచివున్న వాహనాలు

చిల్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోమిడి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన్న కల్వర్టు మరమ్మతులు సక్రమంగా చేపట్టకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ వాహనదారులు శనివారం కల్వర్టు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మోమిడి గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టుకు మరమ్మతులు సక్రమంగా చేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కల్వర్టు వద్ద ఉన్న రోడ్డు పూర్తిగా సిలికాతో నిండిపోయివుందని, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి కల్వర్టు, రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న చెన్నూరు పీహెచ్‌సీ సిబ్బంది

గూడూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, హైపర్ టెన్షన్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని 21 పంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

డక్కిలి: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది కార్యాలయ పరిసరాల్లో చెత్తను తొలిగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో జగదీష్ బాబు పాల్గొన్నారు.

పుష్కర కుంభాభిషేకం



వెంకటగిరి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పుష్కర కుంభాభిషేక మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గోపూజ, ధనపూజ, కలశస్థాపన, సకలదేవతా ఆహ్వానం, మూల మంత్రం, నవగ్రహ జపాలు, చండీ నవార్ణవ సప్తశతీ పారాయణం, లఘు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీర, కిరీటంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గుండెపోటుతో డిజిటల్ అసిస్టెంటు మృతి



వీరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది

డక్కిలి, మే 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం డి.వడ్డిపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న తాటిమళ్ల వీరయ్య(38) గుండెపోటుతో మృతి చెందారు. డక్కిలి మండలం డి.ఉప్పరపల్లికి చెందిన వీరయ్య శుక్రవారం విధుల హాజరయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో డక్కిలి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని ఇంటికి వెళ్లారు. అదేరోజు రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీవో గుణశేకరరెడ్డి, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, పిన్నక జగదీష్ బాబు, డి.వడ్డిపల్లి సర్పంచు చెంచమ్మ, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది శనివారం వీరయ్యకు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బైక్ చోరీ

కోట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో గల కొత్తపాళెం రోడ్డులో మోటార్ బైక్ అపహరణకు గురైంది. కొత్తపాళెం రోడ్డులో నివాసం ఉంటున్న రవీంద్ర శుక్రవారం రాత్రి తన మోటార్ బైక్‌ను ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. శనివారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో ఎస్ఐ పవన్‌కు ఫిర్యాదు చేశాడు.

వెంకటగిరిలో చిరుజల్లులు

వెంకటగిరి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శనివారం తేలికపాటి చిరుజల్లు కురిశాయి. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం తరువాత మబ్బులు కమ్మి వర్షం కురిసింది.